జిల్లాలో అధికం

వైసీపీ హయాంలో రెవెన్యూలో పేరుకుపోయిన అర్జీలు

వేధిస్తున్న భూ సమస్యలు

- కూటమి ప్రభుత్వంలో అర్జీదారుల్లో చిగురిస్తున్న ఆశలు
- పరిష్కారంపై కలెక్టర్ దృష్టి

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో భూ సంబంధిత సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. బాధితులు గత వైసీపీ ప్రభుత్వంలో న్యాయం కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తుండడంతో బాధితులు క్యూ కడుతున్నారు. కలెక్టర్ స్వీకరిస్తున్న అర్జీల్లో రెవెన్యూ, భూసర్వే శాఖకు చెందినవే ఎక్కువగా ఉండడం గమనార్హం.



అనకాపల్లి తహసీల్దార్ కార్యాలయం

వైసీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలోని రెవెన్యూ కార్యాలయాలకు మ్యుటేషన్, రెవెన్యూ వెబ్ రికార్డుల్లో చేర్పులు, మార్పుల కోసం వచ్చేవారు తీవ్ర నిరాశ చెందారు. తహసీల్దార్ల కార్యాలయాల్లో పరిష్కారానికి నోచుకోని అర్జీలు గుట్టలుగా పేరుకుపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టర్, జేసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. జూన్ ఒకటో తేదీన ఈ కార్యక్రమానికి 136 అర్జీలు అందగా, వాటిలో రెవెన్యూ, సర్వే శాఖలకు సంబంధించిన అర్జీలు 92 ఉన్నాయి. ఇదే నెలలో 8న జరిగిన కార్యక్రమానికి 303 అర్జీలు అందగా, వాటిలో 195, జూన్ 15న 247 అర్జీల్లో 161, ఇదే నెలలో 22న అందిన 175 అర్జీల్లో 116, 29న అందిన 283 అర్జీల్లో 182 రెవెన్యూ, భూసర్వే శాఖకు చెందినవి కావడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఈ సమస్యల పరిష్కారంపై కలెక్టర్ విజయకృష్ణన్ దృష్టి పెట్టారు. తమ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని బాధితులు కూడా ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికపై కూటమి కసరత్తు

తేలని అభ్యర్థి

- సీఎంతో ఉమ్మడి జిల్లా ప్రజా ప్రతినిధులు, నేతల సమావేశం
- గెలుపు ఖాయమన్న కొందరు... పోటీకి దూరంగా ఉంటే మంచిదన్న మరికొందరు
- పోటీ/అభ్యర్థి ఎంపికపై ఆరుగురితో కమిటీ ఏర్పాటు

విశాఖపట్నం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి):

ఎమ్మెల్సీ (స్థానిక సంస్థల కోటా) ఉప ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఎంపిక ఇంకా కొలిక్కిరాలేదు. శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమక్షంలో ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, నాయకుల సమావేశం జరిగింది. నేతల అభిప్రాయాలు తెలుసుకున్న అనంతరం ఉమ్మడి జిల్లాలో పార్టీల బలాబలాలపై చంద్రబాబు చర్చించారు. జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో విజయం సాధించామని, అదే ఊపుతో ఎమ్మెల్సీ పదవిని గెలుచుకుంటామని కొందరు నాయకులు చెప్పారు. అభ్యర్థి ఎవరైనా గెలుస్తామన్నారు. ఇప్పటికే వైసీపీకి చెందిన చాలామంది సభ్యులు కూటమికి మద్దతు తెలిపారని వివరించారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులను వైసీపీ ఉత్తర భారతదేశ యాత్రకు తీసుకువెళ్లిన విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. అయితే వైసీపీతో పోల్చితే కూటమికి తక్కువ ఓట్లు ఉన్నాయని పేర్కొంటూ పోటీకి దూరంగా ఉంటే మంచిదని మరికొందరు అభిప్రాయపడ్డారు. దీంతో నేతలంతా మరోసారి కూర్చుని పోటీ/అభ్యర్థిపై తేల్చాలని అధినేత సూచించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులు తెలుసుకుని తనకు నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, హోం మంత్రి వంగలపూడి అనిత, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణమూర్తి, పంచకర్ల రమేష్‌బాబు, విష్ణుకుమార్‌రాజులతో కమిటీని ఏర్పాటుచేశారు. ఈ సమావేశానికి పల్లా శ్రీనివాసరావు, హోం మంత్రి వంగలపూడి అనిత, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, కొణతాల రామకృష్ణ, బండారు సత్యనారాయణమూర్తి, విష్ణుకుమార్‌రాజు, వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, సుందరపు విజయకుమార్, విశాఖ, అనకాపల్లి జిల్లాల అధ్యక్షులు గండి బాబ్జీ, బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్సీ బుద్దా నాగజగదీశ్వరరావు, మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, మాడుగుల నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్ హాజరయ్యారు. కాగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ నుంచి పోటీ చేయడానికి గండి బాబ్జీ, పీలా గోవింద సత్యనారాయణ, పీవీజీ కుమార్, బత్తుల తాతయ్యబాబు సిద్ధం గా ఉన్నారు. బైరా దిలీప్ చక్రవర్తి పేరు కూడా పరిశీలనలో ఉంది.

ఆదివాసీ దినోత్సవ సందడి



విల్లు ఎక్కుపెడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్


ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని మాడుగుల మండలంలోని తాటిపర్తి ట్రైబల్ వెల్ఫేర్ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ విజయకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థినులతో కలిసి థింసా నృత్యం చేశారు. అంతకు ముందు ఆమె ఆదివాసీ యోధుల చిత్రపటాల వద్ద నివాళులర్పించారు.

- వార్త 7వ పేజీలో..

వసతి లేని గృహాలు

శిథిల భవనాల్లో ఎస్సీ హాస్టళ్లు

- గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శలు
- పెచ్చులూడి పడుతున్న శ్లాబ్
- తలుపుల్లేని కిటికీలు
- అవస్థలు పడుతున్న విద్యార్థులు
- సమస్యలపై దృష్టి సారించిన కూటమి ప్రభుత్వం
- మరమ్మతులకు అంచనాలు తయారు చేసిన ఇంజనీరింగ్ అధికారులు



వసతి గృహంలో శ్లాబ్ పెచ్చులు ఊడి పడిన దృశ్యం

నర్సీపట్నం, ఆగస్టు 9:

సాంఘిక సంక్షేమ వసతి గృహాలు వసతుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం సాంఘిక సంక్షేమ వసతి గృహాల అభివృద్ధిని గాలికి వదిలేసిందన్న విమర్శలు ఉన్నాయి. దీంతో పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్న భవనాల్లో ఎస్సీ విద్యార్థులు తలదాచుకుంటున్నారు. ఈ పరిస్థితులపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టింది. తాజాగా సాంఘిక సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ విభాగం ఏఈ శ్రీనివాసరావు ఏఎస్‌డబ్ల్యూవో పరిధిలోని ఎస్సీ వసతి గృహాలను పరిశీలించి వెళ్లారు. కొత్తగా శ్లాబ్‌లు, మరుగుదొడ్లు, ఎలక్ట్రికల్ పనులు, ప్లంబింగ్, సెప్టిక్ ట్యాంకుల క్లీనింగ్, ప్రహరీ గోడలు ఎత్తు పెంచడం, మరమ్మతు పనులకు ఒక్కొక్క వసతి గృహానికి మేజర్, మైనర్ రిపేర్లకు రూ.20 లక్షలు ఖర్చు అవుతుందని అంచనా వేశారు.

ఏఎస్‌డబ్ల్యూవో పరిధిలో 11 సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో 1,193 మంది విద్యార్థులు ఉంటున్నారు. నర్సీపట్నం, గొలుగొండ, నాతవరం, మాకవరపాలెం, రోలుగుంట, రావికమతం మండలాలలో శిథిలావస్థలో ఉన్న భవనాలలో సాంఘిక సంక్షేమ వసతి గృహాలు నిర్వహిస్తున్నారు. నర్సీపట్నం, గొలుగొండ, నాతవరం, కొత్తకోట బాలుర వసతి గృహాలు మరింత అధ్వానంగా ఉన్నాయి.



నర్సీపట్నం ఎస్సీ బాలుర వసతి గృహం

పెచ్చులు ఊడిపోతున్న శ్లాబ్

నర్సీపట్నం ఎస్సీ బాలుర వసతి గృహం భవనం పూర్తి శిథిలావస్థలో ఉంది. గురువారం శ్లాబ్ పెచ్చులు ఊడి పడిపోవడంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. వసతి గృహంలో 120 మంది విద్యార్థులకు కేవలం ఐదు గదులు ఉన్నాయి. విద్యార్థులు దుప్పట్లు పరుచుకొని కఠిక నేల మీద నిద్రిస్తున్నారు. కిటికీ రెక్కలు, గుమ్మాలు, తలుపులు కదిలిపోయి రేపో, మాపో ఊడిపోయే పరిస్థితిలో ఉన్నాయి. 120 మంది విద్యార్థులకు నాలుగు మరుగుదొడ్లు ఉన్నాయి. అవీ కూడా శిథిలావస్థలో ఉన్నాయి. తలుపులకున్న రేకులు తుప్పు పట్టి సగం విరిగిపోయాయి. వర్షం పడితే గదులన్నీ కారిపోయి విద్యార్థులకు కంటి మీద కునుకు ఉండడం లేదు. కిటికీ రెక్కలు లేకపోవడంతో చలి కాలంలో అవస్థలు పడుతున్నారు. ప్రహరీ గోడ ఎత్తు లేకపోవడంతో సరైన రక్షణ లేకుండా పోయింది.

పదేళ్ల క్రితం గోడ కూలిపోయినా..

నాతవరం ఎస్సీ బాలుర వసతి గృహంలో మెయిన్ రోడ్డు వైపు ప్రహరీ గోడ కూలిపోయి పదేళ్లు దాటి పోయింది. వసతి గృహంలో 78 విద్యార్థులు ఉంటున్నారు. భవనం పూర్తిగా శిథిలావస్థలో ఉంది. వర్షం పడితే శ్లాబ్ నుంచి నీరు కారిపోతుంది. కాంక్రీట్ పెచ్చులు ఊడిపడుతున్నాయి. స్నానం గదులకు తలుపులు ఊడిపోయాయి. భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ ఉంటున్నారు.



తుప్పు పట్టి పాడైన మరుగుదొడ్ల తలుపులు

ప్రాథమిక పాఠశాలలో ఎస్సీ వసతి గృహం

గొలుగొండ ఎస్సీ బాలుర వసతి గృహం శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్నారు. ఇక్కడ 82 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వసతి గృహం భవనం మెట్ల మార్గం పాడవ్వడంతో ఈ ఏడాది ఫిబ్రవరి ఐదో తేదీన ఒక విద్యార్థి సన్‌షేడ్ మీద నుంచి శ్లాబ్ మీదకు వెళ్లి విద్యుదాఘాతంతో మరణించాడు. ఈ ఘటన తర్వాత వసతి గృహాన్ని ప్రాథమిక పాఠశాలలో ఖాళీగా గదుల్లోకి విద్యార్థులను తరలించారు. ఎస్సీ వసతి గృహం భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇదే విధంగా కొత్తకోట వసతి గృహం కూడా శిథిలావస్థలో ఉంది. భవనం శ్లాబ్ పెచ్చులు ఊడి మీద పడుతుండడంతో విద్యార్థులు భయంతో బిక్కుబిక్కుమని హాస్టల్‌లో తలదాచుకుంటున్నారు. దీనిపై ఏఎస్‌డబ్ల్యూవో శ్యామలను వివరణ కోరగా సాంఘిక సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ విభాగం ఏఈ వసతి గృహాలను సందర్శించి మేజర్, మైనర్ మరమ్మతులకు అంచనాలు తయారు చేశారని తెలిపారు.

సింహాద్రి నాలుగో యూనిట్‌లో ఉత్పత్తి పునరుద్ధరణ

పరవాడ, ఆగస్టు 9: సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎన్టీపీసీ)లోని 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాల్గో యూనిట్‌లో ఉత్పత్తిని శుక్రవారం రాత్రి పునరుద్ధరించారు. వార్షిక నిర్వహణ పనుల నిమిత్తం ఇదే యూనిట్‌ను ఈ ఏడాది జూన్‌లో షెట్డౌన్ చేసిన సంగతి తెలిసిందే. నిర్వహణ పనులు పూర్తిచేసి యూనిట్‌లో ఉత్పత్తిని ప్రారంభించారు. ఇదిలావుంటే మిగతా ఒకటి, రెండు, మూడు యూనిట్లలో ఉత్పత్తి యథావిధిగా కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు. కాగా నాల్గో యూనిట్‌లో ఉత్పత్తి శనివారం తెల్లవారుజామున నాటికి పూర్తిస్థాయిలో జరుగుతాదని వివరించారు. ప్రస్తుతం ప్లాంట్‌లోని అన్ని యూనిట్లలో ఉత్పత్తి జరుగుతోంది.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న బస్సు

- క్లీనర్ మృతి
- 12 మంది లారస్ ఉద్యోగులకు గాయాలు
- డ్రైవర్ సెల్ మాట్లాడుతూ నడపడం వల్లే ప్రమాదం

-7లో

మినీ జెట్టీ నిర్మాణం ఎన్నడో!

ముత్యాలమ్మపాలెం తీరంలో నిర్మాణానికి 15 ఏళ్ల క్రితం ప్రతిపాదనలు

- ఇప్పటికీ కార్యరూపం దాల్చని వైనం
- విపత్తుల సమయంలో మత్స్యకారుల అవస్థలు
- పట్టించుకోని గత పాలకులు
- కూటమి ప్రభుత్వమైనా స్పందించాలని వేడుకోలు



ముత్యాలమ్మపాలెం తీరంలో మినీ జెట్టీ నిర్మాణానికి ఎంపిక చేసిన స్థలం

పరవాడ, ఆగస్టు 9:

మండలంలోని ముత్యాలమ్మపాలెం తీరంలో మినీ జెట్టీ నిర్మాణం కలగానే మిగిలిపోయింది. ప్రభుత్వాలు మారుతున్నా జెట్టీ నిర్మాణం ప్రతిపాదనలకే పరిమితమవుతోంది. దీని వల్ల విపత్తుల సమయంలో మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్నారు. తుఫాన్లు సంభవిస్తే వీరి బాధలు వర్ణనాతీతం. కూటమి ప్రభుత్వమైనా స్పందించి జెట్టీ నిర్మాణానికి సహకరించాలని మత్స్యకారులు కోరుతున్నారు.

ముత్యాలమ్మపాలెం పంచాయతీ పరిధిలో దిబ్బపాలెం, జాలరిపేట, సమ్మంగిపాలెం గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో ఉన్న వారంతా మత్స్యకారులే. చేపల వేటే వీరి జీవనాధారం. సుమారు ఐదువేల మంది పైగా మత్స్యకారులు చేపల వేటనే నమ్ముకుని కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఆయా గ్రామాల్లో సుమారుగా 200 పడవల సహాయంతో వేట సాగిస్తున్నారు. ఇక్కడ జెట్టీ నిర్మాణం చేపట్టకపోవడంతో తుఫాన్ సమయంలో వీరు పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు. విపత్తుల కారణంగా పడవలు, వలలు సముద్రంలోకి కొట్టుకుపోవడంతో తీవ్ర నష్టాల పాలవుతున్నారు. అలాగే తుఫాన్ సంభవిస్తుందని వాతావరణ శాఖ ప్రకటన చేసే సమయంలో పడవలు, వలలను ఒడ్డుకు చేర్చే క్రమంలో చాలా ఇబ్బందులు

... మిగతా 8వ పేజీలో

జెట్టీ లేక ఇబ్బందులు



మినీ జెట్టీ నిర్మాణం చేపట్టకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. వేట నుంచి ఒడ్డుకు చేరిన పడవలకు తీరంలో రక్షణ లేకుండాపోతోంది. తుఫాన్లకు పడవలు, వలలు సముద్రంలోకి కొట్టుకుపోతున్నాయి. దీని వల్ల ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం.

- గనగళ్ల సోమునాయుడు, మత్స్యకారుడు, ముత్యాలమ్మపాలెం

ఎంపీ, ఎమ్మెల్యేలు చొరవ చూపాలి



తీరంలో మినీ జెట్టీ నిర్మాణానికి ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు చొరవ చూపాలి. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన బాధ్యత వారిపై ఉంది. జెట్టీ నిర్మాణం చేపడితే మత్స్యకారుల జీవనోపాధి మెరుగుపడుతుంది.

- చింతకాయల సుజాత, సర్పంచ్, ముత్యాలమ్మపాలెం

క్రైం... crime news

ఆగి ఉన్న లారీని ఢీకొన్న బస్సు

▸ క్లీనర్ మృతి ▸ 12 మంది లారస్ ఉద్యోగులకు గాయాలు



ప్రమాదంలో నుజ్జయిన బస్సు ముందుభాగం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

అచ్యుతాపురం, ఆగస్టు 9: ఆగి ఉన్న లారీని సెజ్‌లోని ఓ కర్మాగారానికి ఉద్యోగులను తీసుకువెళుతున్న బస్సు ఢీకొనడంతో క్లీనర్ మృతి చెందగా, 12 మంది ఉద్యోగులు గాయాలకు గురయ్యారు. ఇందుకు సంబంధించిన వివరాలివి. ఓ ప్రైవేటు ట్రావెల్ బస్సు ఎస్.రాయవరం మండలం నుంచి సెజ్‌లో గల లారస్-4 కర్మాగారానికి బి-షిఫ్టు నిమిత్తం ఉద్యోగులను శుక్రవారం తీసుకు వస్తోంది. రాంబిల్లి మండలం వెంకటాపురం జంక్షన్ దాటి లంకధర్మవరం రోడ్డు వద్దకు వచ్చేసరికి ఎదురుగా ఆగి ఉన్న లారీని బలంగా ఢీకొంది. దీంతో బస్సు ఎడమభాగం నుజ్జయింది. క్లీనర్ పెంటకోట రమణ తీవ్రగాయాలకు గురయ్యాడు. అనకాపల్లి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందాడు. అలాగే ఈ ఘటనలో మరో 12 మందికి గాయపడగా, ఇందులో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరికి అచ్యుతాపురంలోని ఓ ప్రవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి తీవ్రంగా గాయపడిన వారిని అనకాపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని బస్సులో ఉన్న ఉద్యోగులు తెలిపారు. ఇదిలావుంటే, మృతిచెందిన క్లీనర్ పెంటకోట రమణ కుటుంబానికి పరిహారం ఇచ్చి ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. ఇక్కడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు.

పనోరమ హిల్స్‌లో భారీ చోరీ

▸ 30 తులాల బంగారం, రూ.10 లక్షల నగదు అపహరణ

▸ గురువారం రాత్రి ఘటన?



చెల్లాచెదురుగా పడి వున్న వస్తువులు

ఎండాడ, ఆగస్టు 9: ఎండాడ పనోరమ హిల్స్‌లోని ఓ విల్లాలో భారీ చోరీ జరిగింది. సుమారు 30 తులాల బంగారం, రూ.10 లక్షల నగదు అపహరణకు గురైనట్టు పీఎం పాలెం పోలీసులు తెలిపారు. వారు చెప్పిన వివరాలు ప్రకారం...పనోరమ హిల్స్‌లో (విల్లా నంబర్ 43 ఏ) అపోలో హాస్పిటల్ వైద్యుడు కె. వెంకటేశ్వరరావు, ఆయన సతీమణి కేజీహెచ్ వైద్యురాలు సంధ్యాదేవి కొన్నేళ్లుగా నివాసం ఉంటున్నారు. గురువారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో భీమవరం బయలుదేరి వెళ్లారు. శుక్రవారం మధ్యాహ్నం తిరిగి వచ్చేసరికి ఇంట్లో సామగ్రి అంతా చిందరవందరగా పడేసి ఉంది. చోరీ జరిగినట్టు గుర్తించి పీఎం పాలెం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు క్లూస్ టీమ్‌తో విల్లాకు చేరుకున్నారు. సీసీ ఫుటేజ్‌ను పరిశీలించడంతో పాటు సెక్యూరిటీని, స్థానికులను విచారించారు. చోరీలో సుమారు 30 తులాల బంగారం, 10 లక్షల నగదు అపహరణకు గురైనట్టు పోలీసులు చెబుతున్నారు. గురువారం రాత్రి ఈ సంఘటన జరిగినట్టు భావిస్తున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నేర పరిశోధన విభాగం ఏడీసీపీ మహేష్, ఏసీసీ వెంకట్రావు, సీఐ రాంబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా అత్యధిక భద్రత ఉండే విల్లాలో దొంగతనం జరగడంతో అక్కడ నివాసం ఉంటున్నవారు భయాందోళన చెందుతున్నారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాలు సీజ్



పట్టుబడిన వాహనాలను స్టేషన్‌కు తరలించిన దృశ్యం

సబ్బవరం, ఆగస్టు 9 : మండలంలోని అక్రమంగా మట్టిని తరలిస్తున్న వాహనాలను మైనింగ్ అధికారులు సీజ్ చేశారు. ఇందుకు సంబంధించి మైనింగ్ రాయల్టీ అధికారిణి స్వాతి తెలిపిన వివరాలివి. రాయపుర అగ్రహారంలో శుక్రవారం ఓ ప్రైవేటు స్థలం నుంచి పేరొక చోటుకు యంత్రం ద్వారా మట్టిని తవ్వి తరలిస్తున్నట్టు తమకు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు గ్రామానికి వెళ్లి పరిశీలించగా, ఎక్సకవేటర్‌తో మట్టి తవ్వి ఐదు ట్రాక్టర్ల ద్వారా తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. వాటిని స్థానిక పోలీసు స్టేషన్‌కు తలించినట్టు చెప్పారు. అక్రమంగా గ్రావెల్ తరలించినవారు ఎంతటి వారైనా చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

ప్రభుత్వ భూముల్లో షెడ్లు తొలగింపు

బుచ్చెయ్యపేట, ఆగస్టు 9: కొండెంపూడి శివారు అయ్యిరెకలపాలెంలో ప్రభుత్వ భూముల్లో అక్రమంగా వేసిన షెడ్లను శుక్రవారం తొలగించినట్టు హెచ్‌డీటీ అరుణ్‌చంద్ర తెలిపారు. సర్వే నెంబరు 5, 5/2లో సుమారు ఏడు ఎకరాల ప్రభుత్వ బంజరులో ఇద్దరికి డీఫారం పట్టాలు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అయితే ఈ భూములను కొందరు అన్యాక్రాంతం చేసినట్టు స్థానికులు చేసిన ఫిర్యాదు మేరకు చేసిన దర్యాప్తు చేశామన్నారు. ఈ నేపథ్యంలో టీఓటీ యాక్టు ప్రకారం ఈ ప్రభుత్వ భూముల్లో షెడ్లను పోలీసు బందోబస్తుతో తొలగించి, హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశామని అరుణ్‌చంద్ర వివరించారు.

'ఆదివాసీల చట్టాలను పరిరక్షించుకుందాం'



ఆదివాసీ గిరిజన వారోత్సవాల్లో పాల్గొన్న సంఘం నాయకులు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 9 : ఆదివాసీల మనుగడ కోసం రూపొందించిన చట్టాలను పరిరక్షించుకుందాం అని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు పిలుపు నిచ్చారు. ప్రపంచ ఆదివాసీ హక్కుల పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ఎంవీపీ కాలనీలోని గిరిజన్ భవన్‌లో శుక్రవారం వారు జెండా ఎగురవేసి వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు అంబిడి కోటీశ్వరరావు మాట్లాడుతూ అన్ని రంగాల్లోనూ వెనుకబడిన ఆదివాసీలు సమష్టిగా పోరాడి తమ రక్షణ కోసం తెచ్చుకున్న చట్టాలను కాపాడుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీ గిరిజన వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటూ తమను తీవ్రంగా నష్టపరుస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజన విశ్వవిద్యాలయం నెలకొల్పుతామని హామీ ఇచ్చినా, నెరవేర్చలేదన్నారు. ఈ కార్య క్రమంలో సంఘం నాయకులు రూడ సత్యారావు, డిప్పల సాంబమూర్తి, సరమండ గీత, కొప్పు చిట్టిబాబు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	78.00
లైవ్ ధర	98.00
విత్ స్కిన్	166.00
స్కిన్ లెస్	176.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	430
విజయనగరం	434
శ్రీకాకుళం	434

ఉన్నత లక్ష్య సాధనే ధ్యేయం కావాలి

▸ జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

▸ ఘనంగా ఆదివాసీ దినోత్సవం



విద్యార్థినులతో కలెక్టర్ విజయకృష్ణన్

మాడుగుల రూరల్, ఆగస్టు 9: విద్యార్థులంతా క్రమశిక్షణతో ఉన్నత లక్ష్య సాధనకు కృషి చేయాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని తాటిపర్తి ట్రైబల్ వెల్ఫేర్ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయిని రమాదేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి బాగా చదువుకుని ఉన్నత స్థానాలను అధిరోహించాలన్నారు. యుక్త వయస్సులో ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా చదువుపైనే దృష్టిసారించాలన్నారు. ముందుగా కలెక్టర్‌ని విద్యార్థినుల థింసా నృత్యాలతో సాదరంగా స్వాగతం పలికారు. గిరిజనులు జీవన విధానంలో వినియోగించే మట్టిపాత్రలు, వివిధ రకాల చిరుధాన్యాలతో తయారు చేసిన పలు వంటకాలు, తదితర స్టాల్స్‌ని పరిశీలించారు. విద్యార్థులు రూపొందించిన పలు ప్రయోగాలను తెలుసుకుని అభినందించారు. అనంతరం సభ కలెక్టర్ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఆదివాసీ పోరాటయోధుల చిత్రపటాలకునివాళులర్పించారు. అనంతరం ఆదివాసీల అడ్డాకుల టోపీని కలెక్టర్ ధరించి ఢంకా మోగించారు. విల్లు ఎక్కుపెట్టి ఆదివాసీ సంస్కృతిని అభినందించారు. విద్యార్థినుల ఆలపించిన గేయాలు, నృత్య ప్రదర్శనలు అలరించాయి. వివిధ ట్రైబల్ పాఠశాలల్లో పదో తరగతి ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచిన విద్యార్థులకు మెమొంటో అందజేసి వారిని కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు కలెక్టర్‌ని సత్కరించారు.

గ్రామాలను షెడ్యూల్ జాబితాలో చేర్చాలి

ఈ సందర్భంగా ఆదివాసీ సంఘం నాయకులు నల్లి కల్యాణం అనకాపల్లి జిల్లాలో నాన్ షెడ్యూల్డ్ ఏరియాలో ఉన్న ఆదివాసీలకు షెడ్యూల్ జాబితాలో చేర్పించి తగు న్యాయం చేయాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. హెచ్‌ఎం రమాదేవి మాట్లాడుతూ పాఠశాలలో అసంపూర్తిగా నిలిచిపోయిన అదనపు తరగతి భవన నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయించాలని కలెక్టర్‌కి విన్నవించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ నాగ శిరీష, తహసీల్దారు పీవీ రత్నం, ఎంపీడీవో కాళీ ప్రసాద్, వార్డెన్ ఉమా మహేశ్వరి, ఉపాధ్యాయ సిబ్బంది, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బంజరు భూమిపై రెండు గ్రామాల మధ్య వివాదం

▸ పరస్పర ఫిర్యాదులపై కేసు నమోదు

బుచ్చెయ్యపేట, ఆగస్టు 9: బంజరు భూమిపై రెండు గ్రామాల మధ్య నెలకొన్న వివాదంతో శుక్రవారం మండలంలో ఉద్రికత్త పరిస్థితులకు దారి తీసింది. స్థానిక ఎస్ఐ డి.ఈశ్వరరావు అందించిన వివరాలి.. ఎల్.సింగవరం సర్వే నంబరు 60లో ప్రభుత్వ బంజరు భూమి 30 ఎకరాలను 40 ఏళ్లుగా కొండెంపూడికి చెందిన 20 కుటుంబాలు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాయి. శుక్రవారం ఎల్.సింగవరానికి చెందిన వేపాడ మధు, రేణం బాలకృష్ణ, వేపాడ కొండయ్య, వరహాలు, రేణం శ్రీను తదితరులు తాము సాగు చేస్తున్న భూములోకి కత్తులతో వచ్చి చెట్లను నరికివేశారని బాధిత రైతులు ఆది ఏసు, శ్రీను, ఎన్. త్రినాథ్, శ్రీదేవి, ఎ.వరలక్ష్మి, నేమాల శ్రీను, పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే.. ఎల్.సింగవరానికి చెందిన వేపాడ మధు తమ రెవెన్యూ పరిధిలోని బంజరును స్థానికులకు పంపిణీకి వెళ్లగా, తమపై ఆది శ్రీను, ఏసు తదితరులు 15 మంది దాడి చేసి గాయపరిచినట్టు ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇరు వర్గాల ఫిర్యాదులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్టు ఎస్ఐ ఈశ్వరరావు తెలిపారు.

టీడీపీ ఖండన

తెలుగుదేశం పార్టీకి చెందిన వేపాడ మధుపై కొండెంపూడికి చెందిన పలువురు వైసీపీకి చెందిన కార్యకర్తలు దాడి చేయడాన్ని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గోకివాడ కోటేశ్వరరావు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, నాయకుడు దొంకిన అప్పలనాయుడు ఖండించారు. వారు విలేకరులతో మాట్లాడుతూ, ఎల్.సింగవరం రెవెన్యూ పరిధిలోని బంజర్ల భూమిని అర్హులకు అందజేయాలనే సదుద్దేశంతో వెళ్లిన మధుపై వైసీపీకి చెందిన సాగు రైతులు దాడి చేయడం సరికాదన్నారు.

పవర్ ప్లాంట్‌పై కొనసాగుతున్న నిరసనలు

▸ సర్వే మధ్యలో నిలిపి వెనుతిరిగిన సిబ్బంది



హైడ్రో ప్లాంట్ నిర్మాణాన్ని వ్యతి రేకిస్తున్న గిరిజనులు

దేవరాపల్లి, ఆగస్టు 9: అదానీ కంపెనీకి చెందిన హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వే, మట్టి నమూనాలకు సేకరణకు వచ్చిన సిబ్బంది సరియానగరం పాలెంలో గిరిజనులు అడ్డుకోనున్నట్టు ముందస్తు సమాచారంతో శుక్రవారం మధ్యలోనే వెనుతిరిగి వెళ్లిపోయారు. మండలంలోని వాలాబు పంచాయతీ శివారు నగరంపాలెం, అనంతగిరి మండలం సరియా జలపాతం వద్ద అదానీ కంపెనీ పవర్ ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వేలు చేపట్టింది. ఈ మేరకు అటవీశాఖ అధికారులు, అదానీ కంపెనీ సిబ్బంది దేవరాపల్లి నుంచి వెళ్లడానికి అనంతగిరి పోలీసులతో సమావేశమయ్యారు, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న, మండల కార్యదర్శి బి.టి. దొర ఆధ్వర్యంలో ముందస్తు సమాచారంతో నగరం పాలెం వద్ద గిరిజనులు నిరసన చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు, అదానీ కంపెనీ సిబ్బంది పోలీసుల సూచనలతో దేవరాపల్లి నుంచి వెనుతిరిగి వెళ్లి పోయారు. ఈసందర్భంగా వెంకన్న మాట్లాడుతూ హైడ్రో పవర్ ప్రాజెక్టు పనులు జరగాలంటే గ్రామ సభలో అనుమతి కావాల్సి ఉం టుందన్నారు. చట్టాలను అతిక్రమించి అదానీ కంపెనీకి ప్రభుత్వం ఇక్కడి భూములను తాకట్టు పెట్టిందా.. అని ప్రశ్నించారు. ఇక్కడ పవర్ ప్రాజెక్టు పనులు చేపడితే ప్రత్యక్షంగా పోరాటాలకు దిగుతామని హెచ్చరించారు.

కాలుష్యంపై కన్నెర్ర

▸ పోర్టులో కాలుష్యం తగ్గించాల్సిందే

▸ అచ్యుతాపురం సెజ్‌లో వసంత్ కెమికల్స్‌లో ప్రమాదంపై విచారణ

▸ పరవాడ రాంకీ ఫార్మా సిటీ చుట్టుపక్కల ద్రవ వ్యర్థాలపై పారబోతపై దృష్టి

విశాఖపట్నం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగరంలో కాలుష్యం తగ్గించేలా చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ మంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించడంతో కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అప్రమత్తమైంది. నగరంతోపాటు పరిసరాల్లో ప్రతి పరిశ్రమలో కాలుష్య ఆడిట్ నిర్వహిస్తామని మంత్రి చెప్పడంతో అధికారులు అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నారు. కాలుష్యం తగ్గించేందుకు చర్యలు తగిన చేపట్టాల్సిందిగా విశాఖ పోర్టు అధికారులను పీసీబీ ఆదేశించింది. విజయవాడలోని కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో శుక్రవారం విశాఖ పోర్టు అధికారులు, మరికొన్ని పరిశ్రమల ప్రతినిధులతో లీగల్ హియరింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోర్టు నుంచి వెలువడుతున్న ధూళి తీవ్రతను పీసీబీ అధికారులు ప్రస్తావించారు. ప్రతి రోజు పోర్టు పరిసరాల్లో స్ప్రింక్లర్లతో నీటిని స్ప్రే చేయాలని, బొగ్గు రవాణా సమయంలో ధూళి వెలువడకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. అచ్యుతాపురం సెజ్‌లోని వసంత్ కెమికల్స్‌లో గత నెలలో జరిగిన ప్రమాదంపై పీసీబీ విచారణ చేపట్టింది. అచ్యుతాపురం సెజ్ నుంచి వ్యర్థాలు బయటకు వస్తున్నట్టు ఆరోపణ వస్తున్నందున ప్రధాన ద్వారం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు, చెక్‌పోస్టు ఏర్పాటుచేయాలని నిర్ణయించారు.

గత నెలలో పెదగంట్యాడ మండలం గంగవరం సమీపంలో సముద్రానికి వెళ్లే కాలువలో ద్రవ వ్యర్థాలు పారబోసేందుకు యత్నించగా పీసీబీ అధికారులు పట్టుకున్నారు. దీనిపై విచారణ చేపట్టిన అధికారులు, దాని మూలాల కోసం రాంకీ ఫార్మాసిటీలో కెమికల్స్ ఉత్పత్తి చేసే కంపెనీలపై దృష్టిపెట్టాలని నిర్ణయించారు. అలాగే పరవాడ మండలం పెద ముషిడివాడలో ద్రవ వ్యర్థాలు పారబోసిన వ్యవహారంపై పోలీసుల నుంచి విచారణ నివేదిక తీసుకుని దాని ప్రకారం చర్యలు తీసుకోవాలని పీసీబీ నిర్ణయించింది.

బీసీవై పార్టీ జాతీయ అధ్యక్షునికి సత్కారం



రామచంద్రయాదవ్‌కు పుష్పగుచ్ఛాలను అందిస్తున్న యువకులు

కొత్తూరు, ఆగస్టు 9 : భారత చైతన్య యువజన పార్టీ జాతీయ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్‌ను అనకాపల్లి నాయకులు, కార్యకర్తలు ఇక్కడ సత్కరించారు. విజయనగరం వెళ్తున్న ఆయనను బైపాస్‌లో మొల్లి శ్రీను, దివాకర్, గుణయాదవ్, రాముయాదవ్, పల్లా కృష్ణ, బాలు, పండు, ఉదయ్, మహేష్ కలిసి పుష్పగుచ్ఛాలను అందజేశారు.

సీఎం చంద్రబాబును కలిసిన 'బుద్ద'

అనకాపల్లి, ఆగస్టు 9 (ఆంధ్ర జ్యోతి): కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి నిర్ణయంపై శుక్రవారం అమరావతిలోని ఉండవల్లిలో టీడీపీ జిల్లా నాయకులతో సమావేశం ఏర్పాటైంది. ఈ సందర్భంగా చంద్రబాబును మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, బత్తుల తాతయ్యబాబు కలిశారు.

ఒకటి నుంచి హెల్మెట్ తప్పనిసరి

▸ వాహన చోదకుడితోపాటు వెనుక కూర్చున్న వ్యక్తి కూడా ధరించాలి

▸ లేనిపక్షంలో మూడు నెలలు డ్రైవింగ్ లైసెన్స్ సస్పెన్షన్, రూ.1,035 జరిమానా

విశాఖపట్నం, ఆగస్టు 9: ద్విచక్ర వాహన చోదకుడితోపాటు వెనుక కూర్చున్న వ్యక్తి కూడా సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి తప్పనిసరిగా హెల్మెట్ (బీఐఎస్ మార్క్) ధరించాలని విశాఖ జిల్లా కలెక్టర్, నగర పోలీస్ కమిషనర్ ఒక ప్రకటనలో కోరారు. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు మార్గదర్శకాలను పూర్తిస్థాయిలో అమలు చేయడం జరుగుతుందన్నారు. హెల్మెట్ ధరించకుండా వాహనం నడపడం ప్రాణాంతకమన్నారు. హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనం నడిపే వ్యక్తికి జరిమానా విధించడంతోపాటు డ్రైవింగ్ లైసెన్స్‌ను మూడు నెలలు సస్పెండ్ చేయడం జరుగుతుందన్నారు. వాహనం నడిపే వ్యక్తి, వెనుకకూర్చున్న వ్యక్తి..ఇద్దరిలో ఏఒక్కరు హెల్మెట్ ధరించకపోయినా రూ.1,035 జరిమానా విధించనున్నట్టు ఆ ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలందరూ గమనించి హెల్మెట్ ధరించాలని సూచించారు. అలాగే బీఐఎస్ మార్క్ స్టాండర్డ్ లేని హెల్మెట్‌ల అమ్మకందారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

అవినీతిరహితంగా కేజీహెచ్‌ను తీర్చిదిద్దుతాం

▸ కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్లు ఏర్పాటు

▸ సూపరింటెండెంట్ శివానంద



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సూపరింటెండెంట్ శివానంద, ఆర్‌ఎంవో

మహారాణిపేట,ఆగస్టు 9: కేజీహెచ్‌లో అవినీతి, లంచాలకు తావులేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద తెలిపారు. శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయిని పేరొందిన కేజీహెచ్‌లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. వైద్యులు, రోగుల మధ్య అనుబంధం పెంపొందేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు.

ఫిర్యాదుకు ఫోన్ నెంబర్లు ఇవీ..

రోగులు ఆస్పత్రిలో పడుతున్న ఇబ్బందులపై ఫిర్యాదులు వస్తున్నాయని, దీనిపై కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్లు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఫోన్: 0891-2590100, 0891-2589102 నంబర్లకు సమాచారమిస్తే, అందుకు బాధ్యులపై వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేజీహెచ్‌లో జనన, మరణ ధ్రువ పత్రాలు జారీ విధానాన్ని క్రమబద్ధీకరిస్తున్నామన్నారు. కేజీహెచ్‌లో మహా ప్రస్థానం వాహనాల వివరాలు అందరికీ తెలిసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. క్యాజువాలిటీ వార్డు నిర్వహణలో మరిన్ని సం స్కరణలు తీసుకురానున్నట్టు చెప్పారు. ఆసుపత్రిలో వాహనాల రా కపోకలపై కఠిన నిబంధనలు అమలు చేస్తామని చెప్పారు. పోస్టరు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఆర్‌ఎంవో దవళ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో శ్రావణ శోభ

▸ నూకాంబిక ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



నూకాంబిక ఆలయంలో వరలక్ష్మి వ్రతాలు చేస్తున్న మహిళలు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 9 : శ్రావణ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా అమ్మవార్ల ఆలయాల్లో భక్తుల కోలాహలం నెలకొంది. ఇక్కడి నూకాంబిక అమ్మవారి బాలాలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ మాసంలోని నాలుగు శుక్రవారాలు ఆలయంలో ఉచితంగా ఈ వ్రతాలు జరుపుతామని ఈవో బండారు ప్రసాద్ తెలిపారు. ఇదిలావుండగా గవరపాలెం సతకంపట్టు కనకదుర్గ ఆలయం, కామాక్షిదేవి ఆలయం, సంతోషిమాత ఆలయం, గౌరీపంచాయతన ఆలయం, కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో వేకువజాము నుంచి విశేష పూజలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

సోమలింగేశ్వర ఆలయ షాపులు అద్దెకు వేలం

సబ్బవరం, ఆగస్టు 9 : మండలంలోని బంగారమ్మపాలెం పంచాయతీ లింగాలతిరుగుడు సోమలింగేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన నాలుగు షాపులను మూడేళ్ల కాల వ్యవధికి లీజుకు ఇచ్చేందుకు ఈ నెల 14న ఆలయం వద్ద బహిరంగ వేలం పాట నిర్వహించనున్నామని ఆలయ ఈవో కీర్తి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు రూ.ఐదు వేలు ప్రథమ ధరావతు చెల్లించి పాటలో పాల్గొనవచ్చునని వివరించారు. పాట ఖరారైన వెంటనే పన్నెండు నెలల అద్దెను సెక్యూరిటీ డిపాజిట్‌గా చెల్లించాల్సి ఉంటుందని వివరించారు.

ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తులు

కొత్తూరు, ఆగస్టు 9 : గురు పూజోత్సవం సెప్టెంబరు 5న జరగనున్న సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్, మండల పరిషత్, ప్రభుత్వ ఏపీ మోడల్ స్కూల్, ఏపీఆర్ఎస్, ఎయిడెడ్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం ఆమె కోరారు. దరఖాస్తులను, వాటికి సంబంధించిన ఆధారాలతో మండల పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సంబంధిత ఎంఈవోలకు , ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు ఎలమంచిలి ఉప విద్యాశాఖాధికారి కార్యాలయంలో సమర్పించాల్సిందిగా ఆమె సూచించారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పు పునఃసమీక్షించాలి

▸ జిల్లా మాలమహానాడు కార్యవర్గం డిమాండ్



మాలమహానాడు సమావేశంలో పాల్గొన్న కార్యవర్గం సభ్యులు

కొత్తూరు, ఆగస్టు 9: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలని అనకాపల్లి జిల్లా మాలమహానాడు కార్యవర్గం డిమాండ్ చేసింది. శుక్రవారం స్థానిక నర్సింగరావుపేటలో ఉన్న కార్యాలయంలో కార్యవర్గ సభ్యులంతా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నాయకులు పావాడ సన్యాసిరావు, గోడి వెంకటేశ్వరరావు, గుడాల తాతబాబు, నర్సీపట్నం నుంచి అప్పలరాజు, రేబాక మధు, బోని గణేష్ తదితరులు మాట్లాడారు. సుప్రీంకోర్టు వర్గీకరణపై వలు రకాల తీర్పులు ఇవ్వడంపై అనుమానాలు ఉన్నాయన్నారు. ఇదే సుప్రీంకోర్టు గత నెల జూలైలో బీహార్ ప్రభుత్వానికి రిజర్వేషన్‌పై నిర్ణయం తీసుకోవడానికి అధికారం లేదని చెప్పి, ఎస్సీ వర్గీకరణపై మాత్రం భిన్నమైన తీర్పు ఇవ్వడం శోచనీయమని వారు పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో క్రిమిలేయర్ అంశం చేర్చడం రాజ్యాంగ విరుద్ధంగా ఉందని వాపోయారు. న్యాయ పోరాటంతో పాటు ప్రజా పోరాటాల ద్వారా వర్గీకరణ అడ్డుకుంటామని తెలిపారు. క్రిమిలేయర్ వలన మొత్తం దళిత జాతి అధోగతపాలు చేసిన మందకృష్ణ కుట్రను దళితులు అర్థం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో దొమ్మేసి సత్యారావు, మైలపల్లి నాగేశ్వరరావు, వాడల సంజీవ్, కసిపల్లి మానిరాజు, గోనూరు రాజీ తదితరులు పాల్గొన్నారు.

12 మద్యం బాటిళ్లతో వ్యక్తిపై కేసు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 9 : ఇక్కడి సబ్బవరం రోడ్డులో శుక్ర వారం ఒక వ్యక్తి నుంచి 12 క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు హెడ్‌కానిస్టేబుల్ బి.రామకృష్ణ తెలిపారు. అనకాపల్లి మండలం కోడూరుకు చెందిన సేనాపతి రమణ పట్టణంలోని మద్యం దుకాణాల్లో మద్యం బాటిళ్లను కొనుగోలు చేసి స్వగ్రామం వెళ్లేందుకు పాత గోపాలకృష్ణ థియేటర్ వద్ద ఆటో కోసం వేచి ఉన్నాడన్నారు. విజుబుల్ పోలీసింగ్‌లో భాగంగా అనుమానం వచ్చి తనిఖీ చేయగా మద్యం బాటిళ్లు బయటపడినట్టు చెప్పారు. అనంతరం అతనిపై కేసు నమోదు చేశామన్నారు.

ఒకే ఈతలో రెండు దూడలు



అనకాపల్లి జిల్లా చోడవరం మండలం అడ్డూరు గ్రామంలో ఓ ఆవు ఒకే ఈతలో రెండు దూడలకు జన్మనిచ్చింది. గ్రామానికి చెందిన ఎలమంచిలి చినరామునాయుడుకు చెందిన ఆవు శుక్రవారం రెండింటిని ఈనింది. ఇందులో ఒకటి ఆడది (పెయ్య) కాగా... మరొకటి మగది.

\- చోడవరం

ఆవు, దూడలు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయమే లక్ష్యం కావాలి

- వైసీపీ శ్రేణులకు మాజీ మంత్రి 'బొత్స' పిలుపు


సమావేశంలో మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ

అచ్యుతాపురం, ఆగస్టు 9 : ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో వైసీపీ విజయానికి అంతా కృషి చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్స సత్యనారాయణ పిలుపునిచ్చారు. మండలంలోని కొండకర్లలో గల అతిథి గృహయంలో మాజీ ఎమ్మెల్యే యూవీ రమణ మూర్తిరాజు అధ్యక్షతన శుక్రవారం ఏర్పాటైన ఎలమంచిలి నియోజకవర్గ వైసీపీ ప్రతినిధుల సమావేశంలో మాట్లాడారు. ఈ ఎన్నికల్లో టీడీపీ అనైతిక పోటీకి దిగుతుందన్నారు. ఈనెల 13న వైసీపీ ప్రజాప్రతినిధులందరినీ పార్టీ అధ్యక్షుడు జగన్ వద్దకు తీసుకుని వెళతున్నామన్నారు. ఇష్టం ఉన్నవారు అక్కడి నుంచి బెంగళూరు శిబిరానికి రావచ్చన్నారు. ప్రలోభాలకు ఎవరూ లొంగవద్దని బొత్స సూచించారు. ఈ సమావేశంలో మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు, మాజీ మంత్రి కురసాల కన్నబాబు, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, నాయకులు కంబాల జోగులు, సూర్యనారాయణ, సుకుమార వర్మ తదితరులు పాల్గొన్నారు.

తమ్మయ్యపేటలో తాగునీటి సమస్యపై వినతి


వెంకటేశ్‌కు మంచినీటి సమస్యపై వినతిని అందిస్తున్న గ్రామస్థులు

నక్కపల్లి, ఆగస్టు 9 : మండలంలోని చందనాడ శివారు తమ్మయ్యపేటకు చెందిన టీడీపీ నాయకులు, పలువురు మహిళలు తమ గ్రామంలో మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు శుక్రవారం టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్‌ను కలిశారు. హోం మంత్రి అనిత దృష్టికి తమ సమస్యను తీసుకెళ్లాలని ఆయనను కోరారు. దీంతో వెంకటేశ్ వెంటనే ఫోన్‌లో హోం మంత్రి అనితకు తమ్మయ్యపేటలో మంచినీటి సమస్యను వివరించారు. గ్రామంలో నీటి ఎద్దడి నివారణకు రూ.35 లక్షల వ్యయంతో బోరు, పైపులైన్‌ల ఏర్పాటుకు హోం మంత్రి అనిత హామీ ఇచ్చినట్టు వెంకటేశ్ వారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గింజాల లక్ష్మణరావు, నూరకాసుల పెద్ద కాపు, రొక్కల గోవింద్, పుణ్యమంతుల బాబ్జీ, రొక్కల నాగమణి, మరసాల వెంకయ్యనాయుడు, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు రెండు మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

రాంబిల్లి/ ఎలమంచిలి, ఆగస్టు 9 : ఎలమంచిలి, రాంబిల్లి మండలాల్లో విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల్లో భాగంగా శనివారం పలు గ్రామాల్లో సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ శాఖ ఏఈ తెలిపారు. రాంబిల్లి మండలంలోని వెంకటాపురం ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు పనుల్లో భాగంగా పంచదార్ల, భోగాపురం, దారపాలెం, అప్పారాయుడుపాలెం, వెంకటాపురం, హరిపురం గ్రామాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అదే విధంగా ఎలమంచిలిలో శనివారం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు, వ్యవసాయ కనెక్షన్లకు ఉదయం ఆరు నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సరఫరా నిలిపి వేస్తామని వివరించారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

సకాలంలో వైద్యం అందక తల్లి, బిడ్డ మృతి

- చింతపల్లి ఆస్పత్రిలో గైనికాలజిస్టు, ఎనస్థీషియన్ అందుబాటులో లేకపోవడంతో ప్రసవ వేదనతోనే 60 కిలోమీటర్లు ప్రయాణం
- ఆదివాసీ దినోత్సవం రోజున ఏజెన్సీలో విషాదం

గూడెంకొత్తవీధి, ఆగస్టు 9: ఆదివాసీ దినోత్సవం వేళ ఏజెన్సీలో విషాదం నెలకొంది. నిండు గర్భిణికి సకాలంలో వైద్య అందకపోవడంతో తల్లి, శిశువు మృతి చెందారు. అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం రింతాడ పంచాయతీ ఊబపాలెం గ్రామంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి మృతురాలి భర్త కృష్ణ, తల్లిదండ్రులు బంగారం, భానుమతి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వంతల పరిమళ (21)కు నెలలు నిండడంతో గురువారం సాయంత్రం నొప్పులు వచ్చాయి. దీంతో ఆమెను అంబులెన్సులో చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ఆస్పత్రిలో గైనికాలజిస్టు అందుబాటులో లేరు. సిజేరియన్ అవసరమని వైద్యులు గుర్తించారు. చింతపల్లి ఆస్పత్రిలో గైనికాలజిస్టు, ఎనస్థీషియన్ అందుబాటులో లేకపోవడంతో పరిమళను అంబులెన్స్‌లో 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న అనకాపల్లి జిల్లా నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లారు. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి వైద్యులు పరిమళకు సహజ కాన్పు చేశారు. అయితే శిశువు కడుపులోనే మృతిచెందింది. తల్లి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నదని శుక్రవారం తెల్లవారుజామున విశాఖపట్నంలోని కేజీహెచ్‌కు తరలిస్తుండగా, మార్గమధ్యంలోనే పరిమళ తుదిశ్వాస విడిచింది. దీంతో మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. ఆదివాసీ దినోత్సవం రోజే తల్లి, శిశువు మరణించడంతో ఊబపాలెం గ్రామ గిరిజనులు విషాదంలో మునిగిపోయారు. చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో గైనికాలజిస్టు, ఎనస్థీషియన్ అందుబాటులో లేకపోవడం వల్లే తన బిడ్డ మృతి చెందిందని మృతురాలి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

బదిలీపై వచ్చి విధుల్లో చేరిన తహసీల్దార్లు

నక్కపల్లి, ఆగస్టు 9 : ఇక్కడి తహసీల్దార్‌గా ఎస్‌వీ అంబేద్కర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గత ఏడాదికి ఇక్కడికి విచ్చేసిన ఇతనిని ఎన్నికలకు ముందు ప్రభుత్వం బదిలీ చేసింది. శ్రీకాంత్‌ను ఇక్కడ నియమించింది. ఎన్నికల ప్రక్రియ పూర్తికావడంతో అంబేద్కర్‌ను మళ్లీ నక్కపల్లి పంపారు. డీటీ సత్యనారాయణ తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్.రాయవరం: తాహసీల్దార్‌గా కె.విజయకుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి బదిలీల్లో భాగంగా శ్రీకాకుళం జిల్లాకు వెళ్లిన విజయకుమార్ తిరిగి మరలా తన స్థానానికి విచ్చేసి బాధ్యతలు చేపట్టారు. ఆయనకు డిప్యూటీ తహసీల్దార్ కుమారస్వామి, వీఆర్‌వోల సంఘం అధ్యక్షుడు నూకరాజు, వీఆర్‌వోలు స్వాగతం పలికారు.

మినీ జెట్టీ నిర్మాణం ఎన్నడో!


జెట్టీ లేక ఇసుక తిన్నెలపై నిలిపిన తెప్పలు, వలలు, ఇతర సామగ్రి

... 5వ పేజీ తరువాయి

పడుతున్నారు. అధిక బరువులో ఉన్న పడవలను కర్రల సహాయంతో ఇసుక తిన్నెల పైకి చేర్చడం వీరికి సవాల్‌గా మారింది. ఈ క్రమంలో చాలా మంది మత్స్యకారులు వెన్నుపూస సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్ల తరబడి ఇదే పరిస్థితి కొనసాగుతున్నప్పటికీ పట్టించుకునే నాథుడే లేకపోయాడు. సుమారు 15 ఏళ్ల నుంచి తీరంలో మినీ జెట్టీ నిర్మాణం చేపడతామని అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలన్నీ మత్స్యకారులకు హామీలు ఇస్తున్నాయే తప్ప ఆచరణలోకి మాత్రం తీసుకురాలేకపోతున్నాయి. కేవలం ప్రతిపాదనలతోనే సరిపెట్టేస్తున్నాయి. జెట్టీ లేకపోవడం వల్ల మత్స్యకారులు ప్రమాదాల బారిన పడడంతో పాటు మృత్యువాత కూడా పడుతున్నారు. జెట్టీ ఏర్పాటు చేసినట్టయితే వేట సక్రమంగా సాగడంతో పాటు మత్స్యకారులు కూడా ఎలాంటి ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదు. విపత్తుల సమయంలో ఆందోళన చెందాల్సిన అవసరం కూడా ఉండదు. కూటమి ప్రభుత్వం స్పందించి జెట్టీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు.

మహాలక్ష్మీ నమోస్తుతే

- శ్రావణమాసం తొలి శుక్రవారం సందర్భంగా అమ్మవార్ల ఆలయాలు భక్తులతో కిటకిట
- వేకువజాము నుంచి విశేష పూజలు
- పలుచోట్ల సామూహిక వ్రతాలు


కశింకోటలోని దుర్గాదేవి ఆలయంలో భక్తుల కోలాహలం



సబ్బవరం మండలం దేవీపురంలో..., నక్కపల్లి మండలం ఉపమాక దుర్గమ్మ ఆలయంలో...


గవరపాలెం సంతోషిమాత ఆలయంలో విశేష అలంకరణలో అమ్మవారు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 9 : తెలుగింటి మహిళలు అత్యంత పవిత్రంగా భావించే మాసాల్లో శ్రావణమాసం ఒకటి. ఈ నెలరోజులూ వివిధ ఆలయాల్లో కొలువుదీరిన అమ్మవారిని లక్ష్మీదేవిగా ఆరాధిస్తుంటారు. దీంతో ఆలయాన్నీ భక్తులతో కోలాహలంగా మారుతుంటాయి. శ్రావణ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా అనకాపల్లి పట్టణంలో ఇదే సందడి కనిపించింది. ఇందులో భాగంగా గవరపాలెం సతకంపట్టు కనకదుర్గ ఆలయం, కామాక్షిదేవి ఆలయం, సంతోషిమాత ఆలయం, గౌరీపంచాయతన ఆలయం, కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో వేకువజాము నుంచి విశేష పూజలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

నక్కపల్లి : శ్రావణమాసం తొలి శుక్రవారం సందర్భంగా అమ్మవార్ల ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. నక్కపల్లి మండలంలోని బంగారమ్మపేట, గొడిచెర్ల, నక్కపల్లి, ఉపమాక గ్రామాల్లో ఉన్న దుర్గమ్మ ఆలయాలకు మహిళలు వెళ్లి పూజలు చేశారు.

కశింకోట : స్థానిక జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న దుర్గాదేవి ఆలయం శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. తొలి శ్రావణ శుక్రవారం కావడంతో మహిళలు వేకువజామున ఆలయానికి చేరుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, పుష్పాలు సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ఆలయ వ్యవస్థాపకుడు నడిగట్ల ప్రసాద్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఎలమంచిలి : మండలంలోని అమ్మవార్ల ఆలయాల్లో శ్రావణ లక్ష్మీ పూజలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలి శుక్రవారం కావడంతో పెద్ద సంఖ్యలో ఆలయానికి మహిళలు చేరుకుని కుంకుమార్చనలు జరిపారు. ఎలమంచిలి పట్టణంలోని సంతోషిమాత, కామాక్షీ అమ్మవారు, కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఏటికొప్పాక, పీఎస్‌ఆర్‌పేట, పులపర్తి తదితర గ్రామాల్లోనూ ఈ వేడుకలను నిర్వహించారు.

సబ్బవరం : మండలంలోని దేవీపురంలో శుక్రవారం నాగ పంచమి వేడుకలను గురుపత్ని అన్నపూర్ణమ్మ ఆధ్వర్యంలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నాగదేవతకు సామూహిక అష్టోత్తరశత నామావళి, సహిత షోడశోపచార పూజలు జరిగాయి. పాలు, వివిధ రకాల పండ్లతో పాటు పసుపు కుంకుమలను సమర్పించారు. పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అలాగే, సబ్బవరంలో దుర్గమాంబ ఆలయంలో శ్రావణ శుక్రవారం పూజలు ఘనంగా జరిగాయి. కుంకు మార్చనలో పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన ఎలమంచిలి వైస్ ఎంపీపీలు


వైసీపీ నుంచి జనసేనలో చేరిన వారితో ఎమ్మెల్యే సుందరపు

ఎలమంచిలి, ఆగస్టు 9 : వైసీపీకి చెందిన పలువురు మండల నాయకులు శుక్రవారం జనసేన పార్టీలో చేరారు. వైస్ ఎంపీపీలు రాజాన శేషు, ఎస్. ఉమలతో పాటు పట్టణానికి చెందిన పలువురు నేతలు ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ సమక్షంలో జనసేన తీర్థం పుచ్చుకున్నారు. వీరికి మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో విజయకుమార్ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈకార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బొద్దపు శ్రీను, మాజీ కౌన్సిలర్ పిట్టా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్యాకేజీ కోసం కారిడార్ నిర్వాసితులు ఆందోళన



ప్యాకేజీ కోసం నినాదాలు చేస్తున్న నిర్వాసిత రైతులు

నక్కపల్లి, ఆగస్టు 9 : విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం భూములిచ్చిన నిర్వాసిత రైతులందరికీ ప్యాకేజీ, పరిహారం అందేవరకూ పోరాటం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని పాటిమీద గ్రామంలో నిర్వాసిత రైతులతో కలిసి ఆయన ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రం వెల్‌కమ్ ఇండియా పేరుతో విదేశాలకు చెందిన కార్పొరేట్ సంస్థలకు భుజం కాస్తోందని పేర్కొన్నారు. నిర్వాసిత రైతుల సమస్యలు పరిష్కరించకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు మండల కన్వీనర్ ఎం.రాజేశ్, నాయకులు బి.రాము, ఆర్.అప్పారావు, టి.నర్సింహమూర్తి,ఆర్.ఈశ్వరరావు,చిన్నమ్మలు,లక్ష్మి పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్ పట్ల అప్రమత్తంగా ఉండాలి


ఫ్లోరోసిస్ నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న విశ్వనాథం

సబ్బవరం, ఆగస్టు 9 : ఫ్లోరోసిస్ వ్యాధి పట్ల అంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఫ్లోరోసిస్ నియంత్రణా ధికారి డాక్టర్ విశ్వనాథం సూచించారు. గుల్లేపల్లి పీహెచ్‌సీ పరిధిలో గల రావలమ్మపాలెం జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఫ్లోరోసిస్‌పై నిర్వహించిన అవగా హన సదస్సులో మాట్లాడారు. బోర్‌వెల్ వాటర్ తాగడం ద్వారా, పొగాకు సంబంధిత ఉత్పత్తుల వినియోగం వల్ల, బ్లాక్‌సాల్ట్, బ్లాక్ టీ వంటివి మితిమీరి వినియోగించడం వలన పలువురు ఫ్లోరోసిస్ బారిన పడుతున్నారన్నారు. అనంతరం విద్యార్థులకు ఫ్లోరోసిస్ పరీక్షలు జరిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్, నర్సింగరావు, ఇందిర, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధితులకు పరికరాలు పంపిణీ

తుమ్మపాల : ఇక్కడి పీహెచ్‌సీలో శుక్రవారం ఫ్లోరోసిస్ బాధితులకు పరికరాలను పంపిణీ చేశారు. వాకింగ్ స్టిక్స్, వాకర్ తదితర పరికరాలను అందజేశారు. డిస్ట్రిక్ ప్రోగ్రామ్ కన్సల్టెంట్ డాక్టర్ విశ్వనాథం మాట్లాడుతూ ఫ్లోరోసిస్ వ్యాధితో బాధపడుతున్న వారికి ప్రభుత్వం ద్వారా గ్రామాల్లో పరికరాలను అందజేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాలయాల్లో ఆదివాసీ దినోత్సవం


సబ్బవరం మండలం గాలిభీమవరం విద్యాలయంలోని వేడుకల్లో సిబ్బంది, విద్యార్థులు

కోటవురట్ల, ఆగస్టు 9 : ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని కోటవురట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇక్కడ పనిచేస్తున్న కిముడు వెంకటలక్ష్మి, సంధ్యారాణి, కరక బాబు, కళ్యాణం ఉపాధ్యాయులను హెచ్‌ఎం ఎం.లక్ష్మి ఆధ్వర్యంలో సిబ్బంది సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆదివాసీల జీవన విధానం గురించి విద్యార్థులకు వివరించారు. అలాగే, అనకాపల్లి, పాయకరావుపేట, ఎలమంచిలి మండలాల్లోని పలు పాఠశాలల్లో ఈ వేడుకలను జరిపారు.

సబ్బవరం : మండలంలోని గాలిభీమవరంలో గల ఆర్యభట్ట పాలిటెక్నిక్ కళాశాలలో ఆదివాసి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో ఉన్న అల్లూరి చిత్రపటానికి పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ ఆర్. నాగభూషణం మాట్లాడుతూ ఆదివాసీల సంప్రదాయాలు, హక్కుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సురేంద్రకుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే, మండలంలోని మరికొన్ని ప్రైవేటు పాఠశాలల్లో ఈ వేడుకను జరిపారు.

గాంధీ విగ్రహం వద్ద పలువురు నివాళి


గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, ఆగస్టు 9 : మహాత్మాగాంధీ చేపట్టిన క్విట్ ఇండియా ఉద్యమ దినోత్సవం సందర్భంగా స్థానిక జీవీఎంసీ కార్యాలయం వద్ద గల మహాత్ముని విగ్రహానికి శుక్రవారం పలువురు నివాళులర్పించారు. ప్రజా రాజకీయ వేదిక కన్వీనర్ కనిశెట్టి సురేష్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అనకాపల్లి బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు శేఖరమంత్రి సాయి వెంకట లక్ష్మణ్, అడపా సుధాకర్, బల్లా నాగభూషణం, కాండ్రేగుల శివ శంకర్, డీవీఎన్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

అచ్యుతాపురం, ఆగస్టు 9 : పరిసరాల పరిశుభ్రతకు అంతా ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ పీజేఎంఆర్‌పీ నాయుడు సూచించారు. హరిపాలెం ఆరోగ్య కేంద్రం పరిధిలోని కొండకర్ల, అందలాపల్లిలలో మలేరియా, డెంగ్యూ, చికన్‌గున్యా తదితర వ్యాధులపై శుక్రవారం ఏర్పాటైన అవగాహన ర్యాలీల్లో మాట్లాడారు. దోమలు కుట్టకుండా అవసరమైన జాగ్రత్తలను ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాస్, ఆరోగ్య పర్యవేక్షకులు సనీత, ఉమామహేష్, గణేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా హీరో మహేష్ జన్మదిన వేడుకలు


కేకు కట్ చేస్తున్న మహేష్‌బాబు అభిమానులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 9 : పట్టణంలోని సత్యనారాయణ థియేటర్‌లో సినీ హీరో మహేష్‌బాబు జన్మదిన వేడుకలను శుక్రవారం ఫ్యాన్స్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. ఫ్యాన్స్ పట్టణశాఖ అధ్యక్షుడు పీలా రాజేష్, బొచ్చు శ్రీనివాసరావు, కాండ్రేగుల శ్రీను, ఆళ్ల మాధవరావు, సాయి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధనను థియేటర్ అధినేత కొణతాల రామలింగస్వామి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దొడ్డి అప్పారావు, పూడి రాజు, సతీష్, షరీఫ్, ఉపేంద్రలతో పాటు ఆంధ్రప్రదేశ్ వెంకటేశ్ హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకులు పి.చందు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు

నక్కపల్లి, ఆగస్టు 9 : రాజయ్యపేట పంచాయతీలో ఇంటి పన్నులు, సంపద కేంద్రం నిర్మాణానికి సంబంధించిన నిధులను దుర్వినియోగమయ్యాయని ఆరోపిస్తూ గ్రామానికి చెందిన జనసేన నాయకుడు పిక్కి స్వామి శుక్రవారం ఈవోపీఆర్‌డీ బి.సత్యనారాయణకు ఫిర్యాదు చేశారు. ఇంటి పన్నుల వసూళ్లు, ఇతర ఆర్థిక వ్యవహారాలకు సంబంధించి పారదర్శకంగా ఖర్చు చేయలేదని, లక్షలాది రూపాయలు ఒక అధికారి దుర్వినియోగం చేశారంటూ ఆరోపించారు.

'టీడీపీ నాయకులపై తప్పుడు ఆరోపణలు'

పాయకరావుపేట, ఆగస్టు 9 : జాతీయ మత్స్యకార సంఘం నాయకుడు మోసా అప్పలరాజు టీడీపీ నాయకులపై చేసిన తప్పుడు ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి బొంది కాశీవిశ్వనాథం అన్నారు. శుక్రవారం ఇక్కడ పలువురు మత్స్యకార నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ 2014 నుంచి హేచరీల్లో పనులు చేసుకుంటున్న వ్యక్తులను 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత తొలగించి, వైసీపీ సానుభూతిపరులను చేర్చుకున్నారని ఆరోపించారు. అప్పట్లో పనులు కోల్పోయి నష్టపోయిన వ్యక్తులు ఐదేళ్ళ తరువాత ఇప్పుడు పనులు కల్పించాలంటూ అడిగినందుకు తమపై అప్పలరాజు నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఆరోపణలు చేసిన అతనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నామన్నారు. మత్స్యకార నాయకులు మోసా సత్యనారాయణ, చొక్కా శ్రీను, చవ్వాకుల వరహాలు, యజ్జల మహేష్, గోసల కృష్ణ, శివకుమార్, పారా గాలిబాబు, సిరిపిన సత్యనారాయణ పాల్గొన్నారు.

'ప్రభుత్వ భూములను కాపాడండి'


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరామ్

అనకాపల్లి టౌన్, ఆగస్టు 9 : పట్టణంలోని ఎన్టీఆర్ వైద్యాలయానికి ఎదురుగా అక్రమ నిర్మాణాలను అరికట్టాలని సీపీఎం మండల కార్యదర్శి గంటా శ్రీరామ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఇక్కడ జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఎన్టీఆర్ వైద్యాలయానికి ఎదురుగా నూతనంగా నిర్మిస్తున్న ఆస్పత్రి సమీపంలో గల జీవీఎంసీ స్థలం సర్వే నంబరు 101లో 5.57 ఎకరాలు ఆస్పత్రి అవసరాల కోసం కేటాయించడం జరిగిందన్నారు. ఇందులో కొంత స్థలాన్ని కొంతమంది కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఎన్టీఆర్ వైద్యాలయం, జీవీఎంసీ అధికారులు వెంటనే స్పందించాల్సిందిగా ఆయన కోరారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు ఆర్.శంకరరావు, కాళ్ల తేలయ్యబాబు, పెంటకోట శ్రీనివాసరావు, జి.సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నాయకుడు కర్రి శివ

ఎలమంచిలి, ఆగస్టు 9 : మునిసిపాలిటీ పరిధి సోమలింగపాలేనికి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు కర్రి శివ శుక్రవారం టీడీపీలో చేరారు. మంగళగిరిలో ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ ఈయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'ఏఎంఏఎల్'లో ఆంగ్ల భాషా నైపుణ్యంపై సదస్సు

కొత్తూరు, ఆగస్టు 9 : ఇక్కడి ఏఎంఏఎల్ కళాశాలలో ఆంగ్ల భాషా నైపుణ్యంపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య వక్త వేగి వెంకట్రావు ప్రపంచంలో ఆంగ్లభాషకు ఉన్న ప్రాముఖ్యతను, భాషపై పట్టు సాధించాల్సిన ఆవశ్యకతను వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ గెల్లా జయబాబు, వైస్ ప్రిన్సిపాల్, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ నిరంజన్‌కుమార్, ఆంగ్ల విభాగాధిపతి బొత్స సాగర్, అధ్యాపకులు మహేశ్వరరావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని ధర్నా

అనకాపల్లి టౌన్, ఆగస్టు 9 : జీవీఎంసీ మలేరియా విభాగంలో పనిచేస్తున్న కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జోనల్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు మాట్లాడుతూ మలేరియా విభాగంలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న స్ప్రేయింగ్ కార్మికులు నలుగురిని వారి గ్రామంలో వ్యక్తిగత గొడవల్లో పోలీస్ కేసు ఉందని రెండు నెలలుగా వారికి విధులను నిలిపివేశారన్నారు. తక్షణమే విధుల్లోకి తీసుకోకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. జీవీఎంసీ కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ప్రతినిదులు ఎన్.అజయ్, బొమ్మల రాము, సంతోష్, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఈ- పంట నమోదుపై అవగాహన


పొలాల్లో పంట నమోదు చేస్తున్న ఏవో ఉమాప్రసాద్

నక్కపల్లి, ఆగస్టు 9 : ఉద్దండపురం లో ఈ-పంట నమోదుపై ఏవో ఉమాప్రసాద్ రైతు సేవా సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. పంట పొలాల్లో వరి నాట్లు వేస్తున్న రైతులకు ఈ-పంట నమోదు వల్ల కలిగే ప్రయోజనాలపై వివరించారు. అనంతరం పంట నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో ఏఈవో సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ వైద్యుడు నక్కపల్లి శేషు మృతి


శేషగిరిరావు (ఫైల్)

నక్కపల్లి, ఆగస్టు 9 : మండల కేంద్రమైన నక్కపల్లికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు ఎన్.శేషగిరిరావు (శేషు) శుక్రవారం మృతి చెందారు. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు ఆయన మండలంలోని అనేక గ్రామాలకు చెందిన నిరుపేదలకు సామాజిక సేవా దృక్పథంతో వైద్యసేవలందించారు. ఆయన మృతి పట్ల పలువురు ప్రజాప్రతినిధులు, ఆర్‌ఎంపీ ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు సంతాపం తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు అంతా విధిగా పాటించాలి

- సీఐ పి.అప్పలరాజు


వాహనాన్ని తనిఖీచేస్తున్న సీఐ అప్పలరాజు

పాయకరావుపేట, ఆగస్టు 9 : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించడంతో పాటు రికార్డులు వాహనంలో ఉంచుకోవాలని సీఐ పి.అప్పలరాజు అన్నారు. శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో పోలీసులు స్థానిక నర్సీపట్నం రోడ్డులో తాండవ షుగర్స్ గేటు వద్ద వాహనాలను తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనదారుల వద్ద రికార్డులు లేకున్నా, అదేవిధంగా గంజాయి అక్రమ రవాణా, ఎటువంటి అనుమతులేకుండా ఇసుక మట్టి అక్రమ రవాణా చేసిన కేసులు నమోదుచేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం మంగవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సీఐ పి.అప్పలరాజు మాట్లాడుతూ మత్తుపదార్థాల వలన కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. పట్టుబడితే కేసులు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

17న పాఠశాల కమిటీ ఎన్నికలు



తహసీల్దార్‌కు వివరాలు అందజేస్తున్న ఎంఈవో

మాకవరపాలెం, ఆగస్టు 9 : మండలంలో ఈ నెల 17న పాఠశాల కమిటీ ఎన్నికలలు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ ప్రసాదరావుకు మండల విద్యాశాఖాధికారి పీఎస్ఎన్ మూర్తి నివేదించారు.ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ 17న మండలంలోని 53 ప్రభుత్వ పాఠశాలలకు ఛైర్మన్ ఎన్నికలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు చెప్పారు. ఇప్పటికే ఎన్నికల షెడ్యూల్‌ను అన్ని పాఠశాలల వద్ద అందుబాటులో ఉంచినట్టు ఎంఈవో తెలిపారు.

అనారోగ్యం వల్లే విచారణకు రాలేదు

» జి.కోడూరు సర్పంచ్ అమ్మాజీ

మాకవరపాలెం, ఆగస్టు 9 : మండలంలో జి.కోడూరు పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశారంటూ వచ్చిన ఆరోపణలకు నోటీసు ఇచ్చారని, అనారోగ్యం కారణంగా విచారణకు హాజరు కాలేదని జి.కోడూరు సర్పంచ్ బోడ్డేటి అమ్మాజీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె శుక్రవారం మాట్లాడుతూ ఉద్దేశపూర్వకంగానే తాను విచారణకు గైర్హాజరైనట్టు టీడీపీ నేత జయరామ్ చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు. పంచాయతీ అధికారులు జారీ చేసిన నోటీసుకు ఇప్పటికే లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చామన్నారు. పంచాయతీలో నిధుల దుర్వినియోగం కాలేదన్నారు. కొందరు పనిగట్టుకొని దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తాను ఎలాంటి విచారణకైనా హాజరు అవుతానని స్పష్టం చేశారు.

ఘనంగా ఆదివాసీ దినోత్సవం

నర్సీపట్నం, ఆగస్టు 9 : జిల్లా గిరిజన ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీకన్య కూడలి నుంచి స్టేడియంలో భారీ ర్యాలీ నిర్వహించారు. గిరిజన సంప్రదాయ గీతాలు, నృత్య ప్రదర్శనతో ఉత్సాహంగా పాల్గొన్నారు. అబీద్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. అనంతరం స్టేడియంలో ఆదివాసీ దినోత్సం సందర్భంగా ఆర్డీవో జయరాం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఆదివాసీల సంస్కృతీసంప్రదాయాలు నాగరికతకు మూల మన్నారు. ఇవి ఎప్పటికీ అపురూపమన్నారు. గిరిజనుల కోసం ప్రభుత్వాలు అందించే పథకాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోరాబు సత్యనారాయణ, దనార్జన్, పటూరి సోమయ్య మాస్టారు, ఎంఈవో తలుపులు, ఎస్. వర్మరాజు, ఎస్ శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

రోలుగుంట తహసీల్దార్‌గా వరహాలు బాధ్యతల స్వీకరణ



తహసీల్దార్ వరహాలును అభినందిస్తున్న సిబ్బంది

రోలుగుంట, ఆగస్టు 8 : స్థానిక మండల తహసీల్దార్‌గా కె.వరహాలు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా విజయనగరానికి బదిలీ అయిన ఆయన తిరిగి ఇక్కడికి వచ్చారు. ఈ మేరకు శుక్రవారం కార్యాలయం సిబ్బంది, వీఆర్వోలు పుష్పగుచ్చాలు ఇచ్చి అభినందనలు తెలిపారు. భూ, ఇతర రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఈసందర్భంగా ఆయన తెలిపారు.

చోడవరం తహసీల్దార్‌గా తిరుమలబాబు



తిరుమలబాబు

చోడవరం: స్థానిక తహసీల్దార్‌గా బి. తిరుమలబాబు శుక్రవారం విధుల్లో చేరారు. ఎన్నికల ముందు బదిలీల్లో భాగంగా శ్రీకాకుళం జిల్లాకు తిరుమలబాబుకు బదిలీ అయింది. ఎన్నికల అనంతరం తిరిగి పాత మండలాలకు తహసీల్దార్లను కేటాయిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో తిరుమలబాబు శుక్రవారం విధుల్లో చేరారు. విధుల్లో చేరిన తిరుమలబాబును రెవెన్యూ ఉద్యోగులు అభినందించారు.

చీడికాడ తహసీల్దార్‌గా రాణి..



బాధ్యతలు స్వీకరిస్తున్న రాణి

చీడికాడ: స్థానిక తహసీల్దార్‌గా బీవీ రాణి బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల్లో శ్రీకాకుళం జి ల్లాకు బదిలీపై వెళ్లిన ఆమె అధికారుల ఆదేశాలమేరకు ఇక్క డకు వచ్చారు ఆమెకు డీటీ పి. రమేష్, సిబ్బంది, వీఆర్వోలు అభినందనలు తెలిపారు.

ఎంఈఓ-1గా బొంజుబాబు



ఎంఈఓను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బుచ్చెయ్యపేట, ఆగస్టు 9: మండల విద్యాశాఖాధికారి-1గా శుక్రవారం కె. బొంజుబాబు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు ఏపీటీఎఫ్ జిల్లా, ఇతర సంఘాల నాయకులు ఎస్.దుర్గా ప్రసాద్, పి.అయ్యన్న, బి.శేషుకుమార్, సిహెచ్.మధుకృష్ణ, కె. శ్రీనివాసరావు, జి.రమణారావు, ధనరాజ్, డి.నారాయణరావు, హరికృష్ణ, విజయకుమార్, రాంబాబు అభినందనలు తెలిపారు.

ఆటలు పోటీలు

బుచ్చెయ్యపేట, ఆగస్టు 9: స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం వడ్డాది జూనియర్ కళాశాల్లో నిర్వహించిన పలు పోటీలు నిర్వహించారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, వ్యాస రచన డిబెట్, పాటల పోటీలను అ ధ్యాపకులు నర్సింహమూర్తి, సుధీర్, శ్రీనివాస్ తదితరులు నిర్వహించారు. విజేతలకు ఈనెల 15న బహుమతులను అందచేయనున్నామనిప్రిన్సిపాల్ వైవీఎల్ అన్నపూర్ణ తెలిపారు.

జగనన్న సర్వే రాళ్లను తొలగించిన సీలింగ్ భూముల రైతులు



సర్వే రాళ్లను తొలగిస్తున్న రైతులు

కృష్ణాదేవిపేట, ఆగస్టు 9 : గొలుగొండ మండలం కొంగశింగి భూముల్లో సర్వేరాళ్లను ప్రభుత్వం ఇచ్చిన సీలింగ్ భూముల రైతులు తొలగించారు. ప్రభుత్వం సీలింగ్ భూములను 1994లో పాతకృష్ణాదేవిపేటకు చెందిన 30 మంది రైతులకు 15 ఎకరాల 20 సెంట్లు ఇచ్చింది. అయితే ఈ భూమిని కొంతకాలంగా కొంగసింగి, ఏఎల్‌పురం గ్రామానికి చెందిన ఏడుగురు రైతులు ఎటువంటి అనుమతులు లేకుండా సాగుచేస్తున్నారు. సుమారు 10 రోజులు క్రితం నుంచి 30 మంది సీలింగ్ భూముల రైతులు తమ భూములను సాగు చేసుకుంటున్నారు.ఈ భూముల్లో తమకు తెలియకుండా ఏఎల్‌పురానికి చెందిన కొందరు వైసీపీ నాయకుల అండదండలతో గతంలో సాగుచేసిన రైతులు ఏడుగురు పేర్లతో జగనన్న సర్వే రాళ్ళు వేశారని సీలింగ్ భూముల రైతులు ఆరోపించారు. దీంతో ప్రస్తుతం సాగు చేసేందుకు అడ్డంగా ఉండటంతో సీలింగ్ భూముల రైతులు జగనన్న సర్వే రాళ్ల తొలగించి తుప్పలు, గెడ్డలో పారేశారు. ఎటువంటి అనుమతులు లేని సాగురైతులు పేర్లు జగనన్న సర్వేరాళ్ళు ఏవిధంగా వేశారని జనసేన నాయకులు, పాతకృష్ణాదేవిపేట ఉపసర్పంచ్ దుంపలపూడి సహదేముడు తదితరులు అధికారులను ప్రశ్నించారు.

ఈ కార్యక్రమంలో సీలింగ్ భూముల రైతులు వత్తల నాగేశ్వనావు, మొండెం సత్యవతి, నారాయణ మూర్తి, జనసేన నాయకులు ఈర్నీ చిన్ని , ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంస్కృతీసంప్రదాయాలను పరిరక్షించుకోవాలి



మాట్లాడుతున్న సర్పంచ్ గంగరాజు

నాతవరం, ఆగస్టు 9 : గిరిజనుల సంస్కృతీసంప్రదాయాలను కాపాడుకోవాలని సరుగుడు సర్పంచ్ జి.గంగరాజు కోరారు. శుక్రవారం సరుగుడు గ్రామంలో స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు ఆదివాసీ దినోత్సవం ప్రాధాన్యం గురించి వివరించారు. బండి గంగరాజు మాట్లాడుతూ సరుగుడు గ్రామ సచివాలయం పరిధిలో 19 గిరిజన గ్రామాలను అల్లూరి సీతారామరాజు జిల్లాలో కలపాలని డిమాండ్ చేశారు వీరందరికీ పాడేరు ఐటీడీఏ ఫలాలు అందేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సరుగుడు మాజీ సర్పంచ్ పట్టెం రాజుబాబు, దుంపా ప్రసాద్ గ్రామ పార్టీ అధ్యక్షులు ఏనుగుల చిన్నా పాల్గొన్నారు.

తహసీల్దార్ బాధ్యతలు స్వీకారం



ప్రసాదరావుకు శుభాకాంక్షలు చెబుతున్న సిబ్బంది

మాకవరపాలెం, ఆగస్టు 9 : తహసీల్దార్‌గా ప్రసాదరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు మండల రెవెన్యూ కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ కౌలు రైతులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులను అందజేయాలన్నారు. కుల ధ్రువీకరణ పత్రాలను పెండింగ్‌లో లేకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీటీ శంకర్‌రావు, ఆర్ఐ జట్టి, వీఆర్వోలు సూరిబాబు, రమణ, లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం తహసీల్దార్‌గా రవిబాబు

నర్సీపట్నం : నర్సీపట్నం తహసీల్దార్‌గా బొమ్మారెడ్డి రవిబాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో పాడేరు నియోజకవర్గం హుకుంపేటకు బదిలీ అయిన ఆయన తాజాగా నర్సీపట్నం తహసీల్దార్‌గా వచ్చారు.



తహసీల్దార్‌గా వచ్చిన రవిబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రెవెన్యూ కార్యాలయం సిబ్బంది

మినీ జెట్టీ నిర్మాణం ఎన్నడో!

... 5వ పేజీ తరువాయి

పడుతున్నారు. అధిక బరువులో ఉన్న పడవలను కర్రల సహాయంతో ఇసుక తిన్నెలపైకి చేర్చడం వీరికి సవాల్‌గా మారింది. ఈ క్రమంలో చాలా మంది మత్స్యకారులు వెన్నుపూస సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్ల తరబడి ఇదే పరిస్థితి కొనసాగుతున్నప్పటికీ పట్టించుకునే నాథుడే లేకపోయాడు. సుమారు 15 ఏళ్ల నుంచి తీరంలో మినీ జెట్టీ నిర్మాణం చేపడతామని అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలన్నీ మత్స్యకారులకు హామీలు ఇస్తున్నాయే తప్ప ఆచరణలోకి మాత్రం తీసుకురాలేకపోతున్నాయి. కేవలం ప్రతిపాదనలతోనే సరిపెట్టేస్తున్నాయి. జెట్టీ లేకపోవడం వల్ల మత్స్యకారులు ప్రమాదాల బారిన పడడంతో పాటు మృత్యువాత కూడా పడుతున్నారు. జెట్టీ ఏర్పాటు చేసినట్టయితే వేట సక్రమంగా సాగడంతో పాటు మత్స్యకారులు కూడా ఎలాంటి ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదు. విపత్తుల సమయంలో ఆందోళన చెందాల్సిన అవసరం కూడా ఉండదు. కూటమి ప్రభుత్వం స్పందించి జెట్టీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు.



జెట్టీ లేక ఇసుక తిన్నెలపై నిలిపిన తెప్పలు, వలలు, ఇతర సామగ్రి

సైన్స్ టీచర్లకు శిక్షణ

నర్సీపట్నం, ఆగస్టు 9 : వ్యక్తిగత పరిశుభ్రతను అందరూ తప్పనిసరిగా పాటించాలని, అపుడు అనారోగ్యం దరి చేరదని ఎంఈవో-2 నాగేంద్ర అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (మెయిన్)లో డెట్టాల్ స్కూల్ హైజినిక్ ప్రోగ్రామ్‌లో 40 మంది సైన్స్ టీచర్లకు శిక్షణ నిర్వహించారు. జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ వి. భగవాన్‌దాస్, హెచ్‌ఎం రత్నం పాల్గొన్నారు.

సకాలంలో వైద్యం అందక తల్లి, బిడ్డ మృతి

చింతపల్లి ఆస్పత్రిలో గైనికాలజిస్టు, ఎనస్థీషియన్ అందుబాటులో లేకపోవడంతో ప్రసవ వేదనతోనే 60 కిలోమీటర్లు ప్రయాణం

ఆదివాసీ దినోత్సవం రోజున ఏజెన్సీలో విషాదం



మృతిచెందిన పరిమళ

గూడెంకొత్తవీధి, ఆగస్టు 9 : ఆదివాసీ దినోత్సవం వేళ ఏజెన్సీలో విషాదం నెలకొంది. నిండు గర్భిణికి సకాలంలో వైద్య అందకపోవడంతో తల్లి, శిశువు మృతి చెందారు. అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం రింతాడ పంచాయతీ ఊబపాలెం గ్రామంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి మృతురాలి భర్త కృష్ణ, తల్లిదండ్రులు బంగారం, భానుమతి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వంతల పరిమళ (21)కు నెలలు నిండడంతో గురువారం సాయంత్రం నొప్పులు వచ్చాయి. దీంతో ఆమెను అంబులెన్సులో చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ఆస్పత్రిలో గైనికాలజిస్టు అందుబాటులో లేరు. సిజేరియన్ అవసరమని వైద్యులు గుర్తించారు. చింతపల్లి ఆస్పత్రిలో గైనికాలజిస్టు, ఎనస్థీషియన్ అందుబాటులో లేకపోవడంతో పరిమళను అంబులెన్స్‌లో60 కిలోమీటర్ల దూరంలో ఉన్న అనకాపల్లి జిల్లా నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లారు. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి వైద్యులు పరిమళకు సహజ కాన్పు చేశారు. అయితే శిశువు కడుపులోనే మృతిచెందింది. తల్లి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నదని శుక్రవారం తెల్లవారుజామున విశాఖపట్నంలోని కేజీహెచ్‌కు తరలిస్తుండగా, మార్గమధ్యంలోనే పరిమళ తుదిశ్వాస విడిచింది. దీంతో మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. ఆదివాసీ దినోత్సవం రోజే తల్లి, శిశువు మరణించడంతో ఊబపాలెం గ్రామ గిరిజనులు విషాదంలో మునిగిపోయారు. చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో గైనికాలజిస్టు, ఎనస్థీషియన్ అందుబాటులో లేకపోవడం వల్లే తన బిడ్డ మృతి చెందిందని మృతురాలి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

నాతవరం తహసీల్దార్‌గా శ్రీనువాసునాయుడు



నాతవరం, ఆగస్టు 9 : నాతవరం తహసీల్దార్‌గా శుక్రవారం ఎస్.శ్రీనువాసునాయుడు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ఇప్పటి వరకూ శ్రీకాకుళం జిల్లాలోని పలాస తహసీల్దార్‌గా విధులు నిర్వహించి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనువాసునాయుడుకు రెవెన్యూ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

13న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

నాతవరం, ఆగస్టు 9 : ఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో నర్సీపట్నం రూరల్ సబ్ డివిజన్ పరిధిలోని పెద్ద బొడ్డేపల్లి విద్యుత్ సంస్థ కార్యాలయంలో విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్టు ఏఈ చంద్రమౌళి తెలిపారు. నాతవరం, గొలుగొండ, కోటవురట్ల మండలాల విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని విద్యుత్ సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు.

పరిశుభ్రతపై అవగాహన ర్యాలీలు

గొలుగొండ, ఆగస్టు 9 : మండలంలోని జోగంపేట, గొలుగొండ, సాలికమల్లవరం గ్రామాల్లో పంచాయతీ, ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో పారిశుధ్య నిర్వహణపై శుక్రవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి రఘురాం మాట్లాడుతూ పారిశుధ్యం పాటిస్తే చాలా వరకూ వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ, తదితరులు పాల్గొన్నారు.



గౌరీపట్నం గ్రామంలో రోడ్డుపై కుక్కల విహారం



చోడవరంలో గుంపులు

భౌ...బోయ్..!

» గ్రామాల్లో కుక్కలు స్వైర విహారం

» నిరోధక చర్యలు శూన్యం » జనం బెంబేలు

చోడవరం, ఆగస్టు 9: గ్రామాల్లో వీధి కుక్కల స్వైర్యవిహారం తో జనాలు బెంబేలెత్తిపోతున్నారు.పంచాయతీల్లో ఈ బెడద తారాస్థాయికి చేరింది. వీధి కుక్కలను నియంత్రించాలంటూ స్థానికులు పంచాయతీ అధికారులకు వినతిపత్రాలిస్తున్నారు. కుక్కలను హతమార్చడంపై ఉన్న నిషేదం ఉన్న నే థ్యంలో పంచాయతీ అధికారులు నిస్సహాయ స్థితిని వ్యక్తంచేస్తున్నారు. ఐదేళ్ల నుంచి పంచాయతీల్లో అధికారులు వీధి కుక్కలపై దృష్టి సారించకపోవడంతో, వీటి సంఖ్య అంతకంతకూ పెరిగిపోతున్నది. జనాలపై దాడి చేయడం, వాహనాల వెంటపడడడంతో జనాలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.పశువులపైనా ప్రతాపం చూపుతున్నాయి. అన్ని పంచాయతీల్లో ఇదే సమస్య నెలకొనడంతో ఏం చేయాలో తెలియడంలేదని సర్పంచులు వాపోతున్నారు. చోడవరం ప్రధానంగా ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రి పరిసరాలు, చోడవరం- దేవరాపల్లి మార్గం, ఆర్టీసీ కాం ప్లెక్స్ పరిసరాలు, సాయిబాబా ఆలయం, ఆంధ్రాబ్యాంకు రోడ్డు, పెదబజారు, చినబజారువీధి, అన్నవరం, వెంకయ్యగారిపేట, బాలాజీనగర్, కోటవీధి, కో ఆపరేటివ్ కాలనీ, ద్వారకానగర్ తదితర ప్రాంతాల్లో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. పగలూ రాత్రీ తేడాలేకుండా పదుల సంఖ్యలో కుక్కలు గుంపులుగా వీధుల్లో రోడ్లపై సంచరిస్తున్నా యి. పాదచారులు, స్కూళ్లకు వెళ్లే చిన్నారులు వీటిని చూసి జడుసుకుంటున్నారు. వాహనాల వెంటపడంతో వాహనదారులు గాయాల పాలవున్నారు. వారంలో ఇద్దరు నుంచి ముగ్గురు వరకూ కుక్కకాటు బాధితులు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్న పరిస్థితి నెలకొంటోంది. గాంధీగ్రామం, గౌరీపట్నం, లక్ష్మీపురం తదితర పంచాయతీల్లో వీధి కుక్కల బెడద తీవ్రంగానే ఉందని స్థానికులు వాపోతున్నారు.

గతంలో పంచాయతీ అధికారులు, సర్పంచులు ప్రత్యేకంగా కుక్కల పట్టుకునే వారిని రప్పించి వీటిని నిరోధానికి చర్యలు తీసుకునేవారు. ఒక్కో కుక్కకు రుసుం చెల్లించి బెడద తగ్గించేవారు. అయితే హతమార్చిన కుక్కలను కొందరు ఫొటోలు తీసి, ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేయడంతో పంచాయతీ కార్యదర్శులు ఇరకాటంలో పడుతున్నారు. వీధి కుక్కలను పట్టుకుని వాటి సంతతి పెరగకుండా వాటికి కుటుంబ నియంత్రణ ఇంజక్షన్లు చేయించే అవకాశమున్నాఈ దిశగా పటిష్ఠ ప్రణాళిక ప్రభుత్వం నుంచి లేదు.

వీధి కుక్కల నిరోధానికి చర్యలు

- బి. నారాయణరావు, ఈవో, చోడవరం మేజర్ పంచాయతీ

వీధి కుక్కలు హతమార్చడానికి అవకాశం లేదు. పట్టణంలో వీధి కుక్కల బెడదపై స్థానికుల నుంచి కూడా ఎక్కువగానే ఫిర్యాదులు వస్తున్నాయి. వీటిని నిర్మూలించే అవకాశం లేనందున, వీటిని పట్టుకుని దూరంగా విడిచిపెట్టేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు ఆలోచన చేస్తున్నాం.

డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలి

చోడవరం, ఆగస్టు 9: డ్రగ్స్‌కు యువతను దూరంగా ఉండాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మల్లిబాబు కోరారు. శుక్రవారం కళాశాలలో ఎన్ ఎస్ ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో నషాముక్త భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్ వల్ల కలిగే అనరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ఎస్ పీవోలు మా ల్యాద్రి, పిచ్చమ్మ, అధ్యాపకులు టి. రాధాకృష్ణ, వి. అప్పలనాయుడు, నారాయణమూర్తి, లక్ష్మి మంగమ్మ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో శ్రావణమాస పూజలు

మాడుగుల, ఆగస్టు 9 : మాడుగుల కేంద్రంలో పలు ఆలయాల్లో శా వ్రణమాస పూజా కార్యక్రమాలు జరిగాయి. తొలి శుక్రవారం కావడంతో మహిళలు ఇళ్లల్లో లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రకాల పిండివంటలు చేసి నైవేద్యంగా పె ట్టారు. అనంతరం పలు దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. దుర్గాదేవి ఆలయంలో అన్న సమారాధన నిర్వహించారు.

పంట నమోదుతో బహు ప్రయోజనాలు



మాట్లాడుతున్న ఏవో రమేష్‌బాబు

దేవరాపల్లి, ఆగస్టు 9: ఖరీఫ్ పంటల నమోదు చేసుకోవాలని ఏవో ఎల్.వై. కాంతమ్మ రైతులను కోరారు. ఈమేరకు శుక్రవారం క్షేత్రస్థాయిలో అవగాహన కలిగించారు. గ్రామ రెవెన్యూ అధికారులు, వ్యవసాయశాఖ గ్రామ సహాయకులు నమోదు కార్యక్రమం చేపట్టాలన్నారు. దీనివల్ల ప్రభుత్వపరంగా ధాన్యంకు మద్దతు ధర, పంటల బీమా, సంక్షేమ పథకాలు, కౌలు రైతులకు అనేక ఉపయోగాలుంటాయన్నారు. కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు పూర్తిచేయాలి

రోలుగుంట, ఆగస్టు 8: ఖరీఫ్ సంబంధించి పంట నమోదు ప్రక్రియను గ్రామాల్లో చేపట్టాలని వీఆర్వోలకు డీటీ సోమశేఖర్ సూచించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. సెప్టెంబరు 15వ తేదీ లోగా ఈ నమోదు ప్రక్రియ పూర్తిచేయాలని సూచించారు. స్థానిక వ్యవసాయ శాఖ సిబ్బంది సహకారంతో గ్రామ సచివాలయాల పరిధిలో ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అన్ని గ్రామాల వీఆర్వోలు పాల్గొన్నారు. మాడుగుల రూరల్: మేలైన సాగు పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏవో వాసుదేవరావు అన్నారు. శుక్రవారం ముకుందపురంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించి అవగాహన కల్పించారు. వరి విత్తనాలకు సూడోమోనాస్ కలిపి విత్తన శుద్ధి చేసి నారు మడిలో విత్తనాలు చల్లితే తెగుళ్ల ఆశించదని చెప్పారు. రైతులు పురుగుల మందులు చల్లే టప్పుడు జా గ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది మంగరాజు, శ్రావణి, రైతులు పాల్గొన్నారు.

క్రీడా సౌకర్యాల కల్పనకు చర్యలు: కలెక్టర్



హైస్కూల్ మైదానంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

చోడవరం, ఆగస్టు 9: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాసౌకర్యాల కల్పన కు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ విజయ్‌కృష్ణన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె స్థానిక ప్రభుత్వ హైస్కూల్ మైదానాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె స్పోర్ట్స్ అథారిటీ అధికారులతో మాట్లాడారు. స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ జొన్నాడ శ్రీనివాసరావు, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎల్‌వీ రమణలు మైదానంలో స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో కళాశాలలో నిర్మించిన బాల్ బ్యాడ్మింటన్, వాలీబాల్ కోర్టులను కలెక్టర్‌కు చూపారు. మైదానం చదును చేయడంతోపాటు, తుప్పలు తొలగించి పరిసరాలు బాగు చేయాలని ఈసందర్భంగా ఆయన పంచాయతీ అధికారులను ఆదేశించారు. బాల్ బ్యాడ్మింటన్, వాలీబాల్ కోర్టుల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించి తనకు పంపించాలని ఆమె అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా క్రీడాకారులను ఆమె పరిచయం చేసుకుని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో చిన్నికృష్ణ, తహసీల్దార్ బి. తిరుమలబాబు, పంచాయతీ ఈవో పాల్గొన్నారు.

గోవాడ షుగర్ ఫ్యాక్టరీని సందర్శన

కలెక్టర్ విజయకృష్ణన్ మండలంలోని గోవాడ షుగర్ ఫ్యాక్టరీని సందర్శించారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీ ఎండీ, అధికారులు కలెక్టర్‌కు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం ఫ్యాక్టరీ స్థితిగతులపై ఎండీ వి. సన్యాసినాయుడు కలెక్టర్‌కు వివరించారు.

ఆదివాసీలకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలి

» మానవహక్కుల వేదిక ప్రతినిధి వీఎస్ కృష్ణ



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తంచేస్తున్న ఆదివాసీలు

చోడవరం, ఆగస్టు 9: రాష్ట్ర వ్యాప్తంగా కొత్తజిల్లాల ఏర్పాటులో ఆదివాసీలకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలని ప్రభుత్వానికి మానవహక్కుల వేదిక ప్రతినిధి వీఎస్ కృష్ణ విజ్ఞప్తి చేశారు. అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా స్థానిక అంబేద్కర్ భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పాలకులు అశాస్త్రీయంగా సర్వే చేసి ప్రకటించిన జిల్లాల వల్ల ఆదివాసీలు ఎక్కువగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త జిల్లా ఆవిర్భావం తర్వాత విభజిత జిల్లాలోని మిగిలిపోయిన ఆదివాసీలకు అల్లూరి , రంపచోడవరం, పార్వతీపురం ఐటీడీఏల సే వలు అందకుండా పోయాయన్నారు. ప్రభుత్వం స్పందించి ఈ ఆదివాసీలకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దే చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో న్యాయవాది అన్నపూర్ణ మాట్లాడుతూ, నాన్ షెడ్యూల్డ్ ఏరియాలో ఉన్న ఆదివాసీల భూములను ఆ క్రమిస్తున్నారని ఆరోపించారు. మైదానప్రాంత గిరిజన గ్రామాలను షెడ్యూల్డ్ ప్రాంతాల్లో కలపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిల భారత గ్రామీణ వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి పీఎస్ అజయ్‌కుమార్ ఆదివాసీలకు ఇచ్చిన డీపట్టాలు ఆక్రమణల చెరలో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సీపీ ఐఎం ఎల్ లిబరేషన్ జిల్లా కార్యవర్గ సభ్యుడు సవరాల గణేష్, దళిత నాయకులు నడుపూరి దేముడు, సీపీ ఎం నాయకులు నాగిరెడ్డి సత్యనారాయణ తదితరుల మాట్లాడారు.

ఆదివాసీల ర్యాలీ

ఈ సందర్భంగా పట్టణంలో సీపీఐ ఎం ఎల్ లిబరేషన్ ఆధ్వర్యంలో ఆదివాసీలు ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. అనంతరం అంబేద్కర్ భవనం వద్ద వి గ్రహానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాలనుంచి వచ్చిన ఆదివాసీలు పాల్గొన్నారు.

కె.కోటపాడు తహసీల్దార్‌గా రమేష్‌బాబు

కె.కోటపాడు, ఆగస్టు 9 : స్థానిక తహసీల్దారుగా రమేష్‌బాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గత సార్వత్రిక ఎన్నికల ముందు ఈసీ శ్రీకాకుళం బదిలీ చేసింది. సందర్భంగా సిబ్బందితో సమావేశమైన ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారానికి అందరూ కృషి చేయాలన్నారు. ప్రభుత్వ ఆదేశాలను తప్పక పాటించాలన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

దేవరాపల్లి, ఆగస్టు 9: ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన పథకం కింద 35 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్టు వైద్యాధికారి పూజిత మేమన శుక్రవారం తెలిపారు. 15 మందికి హైరిస్క్ కేసులను గు ర్తించామన్నారు. ఇద్దరికి రక్తహీనత ఉన్న వారిని స్కానింగ్ కోసం కె.కోటపాడు తరలించామన్నారు.

పీఏసీఎస్ సభ్యుల ఖాతాల నంబర్ల కంప్యూటరీకరణ

చీడికాడ, ఆగస్టు 9: చీడికాడ పీఏసీఎస్ సభ్యులు ఖాతాల కంప్యూటరీకరణకు వివిధ ఆధారాలతో బ్యాంకు పనివేళల్లో సభ్యులు తీసుకురావాలని ఆ సొసైటీ సీఈవో మజ్జి వరహాలుదొర తెలిపారు. పాసుపుస్తకంలేదా, 1బీ, ఆధార్, రేషన్‌కార్డు, పాన్‌కార్డు, నామిని ఆధార్‌కార్డు, రెండు పాస్‌ఫొటోలు, ఫోన్‌నబంర్ సహా జిరాక్స్ కాపీలను ఇవ్వాలని ఆయన కోరారు. వివరాలకు ఫోన్: 9989245373 సంప్రదించాలని ఆయన కోరారు.